జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

NEWS IS RIGHT

https://prajapalana.com/epaper.php



ప్రజాపాలన దినపత్రికలో మంత్లీ అడ్వర్టైజ్‌మెంట్స్

4x5. Rs. 13,000/- p.m.

8x10. Rs. 24,000/- p.m.

12x10. Rs. 36,000/- p.m.

5 లైన్ల క్లాసిఫైడ్ యాడ్ రూ.5000/- p.m.

Quarter Page (16x20) Ad (1st Page) Rs. 96,000/- p.m.

Contact : 8886022523, 9000621111, 9948725373



సంపుటి 16 సంచిక 106 విశాఖపట్నం | శనివారం 09 డిసెంబరు 2023 | 8 పేజీలు | వెల : 5.00


# అందరికీ అండగా ఉంటా..

## బాధితులందరినీ ఆదుకుంటా.. జగన్




వాకాడు : " మైచాంగ్ తుఫాను బాధితులందరికీ అండగా ఉంటాం. నాలుగు రోజుల్లో ఒక వైపు పరిహారం చెల్లింపులు, మరోవైపు అధికారుల నివేదిక మేరకు రూ.32 కోట్ల తక్షణ పునరుద్దరణ పనులు యుద్ధ ప్రతిపదికన పూర్తి చేస్తాం. దెబ్బతిన్న ప్రతి ఎకరా పంటకు పరిహారం చెల్లించే చర్యలు తీసుకుంటాం. ఎవ్వరూ అధైర్య పడవద్దు. " అని రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. తుఫాను దెబ్బతిన్న ప్రాంతాల సందర్శనలో భాగంగా ఈరోజు ఆయన తిరుపతి జిల్లా వాకాడు మండలానికి వచ్చారు. మండలంలో స్వర్ణముఖి నదికి పడిన గండిని పరిశీలించారు. బాలిరెడ్డి పాలెం వద్ద ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శన ద్వారా ఇటు తిరుపతి అటు నెల్లూరు జిల్లాల్లో నష్టాన్ని తిలకించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి, నెల్లూరు జిల్లా కలెక్టర్ హరినారాయణ తమ జిల్లా పరిధుల్లో సంభవించిన నష్టాలను వివరించారు. అనంతరం అక్కడ ఏర్పాటైన సభలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. కురవాల్సిన వర్షపాతంలో సగం వర్షం నాలుగైదు రోజుల్లో కురవడంతో జిల్లాలో అపార నష్టం సంభవించిందని గుర్తించామన్నారు. పటిష్టమైన సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ల వ్యవస్థల ద్వారా నీటి ముంపునకు గురైన ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించ డంలో, ఆస్తి నష్టాన్ని తగ్గించ డంలో అధికారులు కృషి చేశా రన్నారు. తుఫాను బాధితులకు నిత్యావసర వస్తువుల పంపిణీ తో పాటు ప్రతి బాధిత కుటుం బానికి తక్షణ ఉపశమన సహా యం కింద రూ.2,500 అంది స్తున్నామని చెప్పారు. మరో నాలుగు రోజుల్లో పరిహారం అందరికీ అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ తక్షణ మరమ్మతులతో చేసే పునరుద్దరణ పనులు కూడా చేపట్టేందుకు అధికారుల ప్రతి పాదన మేరకు రూ.32 కోట్లు మంజూరు చేస్తామని చెప్పారు. ఇప్పటి లెక్కల ప్రకారం దాదాపు 13 వేల ఎకరాల వరిపంట, 7 వందల ఎకరాల ఉద్యానవ న పంటలకు నష్టం వాటిల్లింద ని, ఆ నష్టానికి పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసు కుంటామని చెబుతూ నష్టపో యిన ప్రతి రైతుకు సహాయం అందుతుందని, ఆ విషయం లో రైతులు ధైర్యంగా ఉండా లని కోరారు. (మిగతా 2లో..)





అమరావతి: తెలంగాణ ఎన్నికల ఫలితాలు.. పక్క రాష్ట్రం ఏపీలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. 2024 ఎన్నికల్లోనూ సేమ్ సీన్ రిపీట్ కాబోతోందా? ఇక్కడి తీర్పు.. అక్కడి మార్పునకు శ్రీకారం చుట్టబోతోందా? టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ఇలాంటి చర్చకే దారి తీస్తున్నాయి. అయితే, అదేస్థాయిలో వైసీపీ నుంచి కూడా రియాక్షన్స్ వస్తుండటంతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. చంద్రబాబు చేసిన ఈ వ్యాఖ్యలు సంచలనం రేపుతున్నాయి. తెలంగాణ తరహాలోనే ఏపీలోనూ అధికార మార్పు తథ్యమంటూ ఆయన చేసిన కామెంట్స్ కొత్త డిస్కషన్‌కు తెరలేపాయి. మరో మూణ్నెళ్లలో మనదే అధికారమంటూ.. ఆయన ధీమా వ్యక్తం చేయడం టీడీపీలో కొత్త జోష్‌ని నింపుతోంది. తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి.. టీడీపీ శ్రేణులు మద్దతిచ్చాయనీ, అందుకే బీఆర్ఎస్ ఓడిపోయిందనీ.. ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారిన పొలిటికల్ ముచ్చట. అదెంత వరకు నిజమనేది పక్కనపెడితే.. అదే ఊపుతో.. ఏపీలో కూడా తాము అధికారంలోకి వస్తామంటున్నారు టీడీపీ అధినేత. అయితే దీనికి అదేస్థాయిలో కౌంటరిస్తున్నారు వైసీపీ నేతలు. ఇక, జనసేన, బీజేపీ అలయెన్స్‌పైనా.. సెటైర్లు వేస్తోంది వైసీపీ. కొల్లాపూర్‌లో పోటీచేసిన బర్రెలక్కకు వచ్చిన ఓట్లు కూడా జనసేన అభ్యర్థులకు రాలేదనీ నోటా కన్నా తక్కువ ఓట్లు పడ్డాయనీ పంచ్‌లు వేస్తోంది. కేఏ పాల్ సైతం ఇదే కామెంట్స్‌తో రెచ్చిపోవడం విశేషం. అయితే, ఖమ్మం జిల్లాతో పాటు బాన్సువాడ, నిజామబాద్, బోధన్ వంటి ఏరియాల్లో సెటిలర్లు వేసిన ఓట్లవల్లే కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ వచ్చిందని రివర్స్ కౌంటర్ ఇస్తోంది టీడీపీ. అయితే, తెలంగాణలో కాంగ్రెస్ గెలిచింది కాబట్టి ఏపీలో తాము గెలవబోతున్నామని టీడీపీ నేతలు చెప్పడంలో అంతరార్థమేంటన్నదే ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

## నాలుగు రాష్ట్రాల్లో స్వల్పంగా కంపించిన భూమి..



హైదరాబాద్: గుజరాత్, మేఘాలయా, తమిళనాడు, కర్ణాటకలో వరుస భూకంపాలు వచ్చాయి. శుక్రవారం ఉదయం 6.52 గంటలకు కర్ణాటకలోని విజయపురాలో భూమి కంపించింది. దీని తీవ్రత 3.1గా నమోదయిందని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ తెలిపింది. 45 నిమిషాల వ్యవధిలో తమిళనాడులోని చంగల్పట్టులో కూడా భూకంపం వచ్చింది. ఉదయం 7.39 గంటలకు 3.2 తీవ్రతతో ప్రకంపణలు చోటుచేసుకున్నాయని, భూ అంతర్భాగంలో 10 కిలోమీటర్ల లోతులో కదలికలు చోటుచేసుకున్నాయని ఎన్‌సీఎస్ వెల్లడించారు. ఉదయం 8.46 గంటలకు మేఘాలయాలోని షిల్లాంగ్‌లో భూమి కంపించింది. దీని తీవ్రత 3.8గా నమోదయిందని అధికారులు తెలిపారు. ఇక గుజరాత్‌లోని కచ్‌లో ఉదయం 9 గంటలకు భూకంపం వచ్చింది. భూ అంతర్భాగంలో 20 కిలోమీటర్ల లోతులో భూమి కంపించిందని వెల్లడించారు. ఈ నాలుగు భూకంపాల వల్ల జరిగిన నష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదన్నారు.

## సూర్యుడ్ని తొలిసారి ఫొటో తీసిన ఆదిత్య ఎల్-1



బెంగళూరు: ఆదిత్య ఎల్-1 మరో ఘనత సాధించింది. సూర్యుడ్ని తొలిసారి ఫొటో తీసింది. ఆ చిత్రాన్ని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ( ఇస్రో) శుక్రవారం విడుదల చేసింది. సూర్యుడి గురించి పరిశోధనల కోసం ఈ ఏడాది సెప్టెంబర్ 2న తొలి సన్ మిషన్ ఆదిత్య ఎల్-1ను ఇస్రో లాంచ్ చేసింది. నవంబర్‌లో అది సూర్యుడి సమీపానికి చేరుకుంది. దీంతో ఆదిత్య-ఎల్1లో ఉన్న సోలార్ అల్ట్రావైలెట్ ఇమేజింగ్ టెలిస్కోప్ (ఎస్‌యూఐటీ)ను నవంబర్ 20న యాక్టివేట్ చేశారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 6న సూర్యుడి గుండ్రటి తొలి చిత్రాన్ని తీసిందని ఇస్రో తెలిపింది. ఆ ఫొటోను శుక్రవారం విడుదల చేసింది. సౌర పరిశీలన, పరిశోధనలో ఒక ముఖ్యమైన మైలురాయి అని అభివర్ణించింది. కాగా, ఎస్‌యూఐటీ ద్వారా 200 నుంచి 400 నానోమీటర్ల తరంగదైర్ఘ్యంతో సూర్యుడు కనిపించే ఉపరితలం, దానిపై ఉండే పారదర్శక పొరకు సంబంధించిన సన్ ఫోటోస్పియర్, క్రోమోస్పియర్ చిత్రం చాలా అద్భుతంగా ఉందని ఇస్రో తెలిపింది. సూర్య కిరణాలు, సోలార్ స్పాట్‌లు, సోలార్ రేడియేషన్‌ను అధ్యయనం చేయడానికి ఈ పొరలు కీలకమని వివరించింది. అంతరిక్ష వాతావరణం, భూమి వాతావరణంపై ఇవి తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపింది. సూర్యుడి వాతావరణానికి సంబంధించిన వివరణాత్మక పరిశీలన కోసం ఈ టెలిస్కోప్‌కు 11 వేర్వేరు ఫిల్టర్లు ఉన్నట్లు పేర్కొంది. ఆదిత్య ఎల్-1ను ప్రయోగించిన సుమారు 127 రోజుల తర్వాత, 2024 జనవరి 7న నిర్దేశిత కక్ష్య ఎల్1ను ఇది చేరవచ్చని ఇస్రో అంచనా వేసింది.

## పంట నష్టపోయిన రైతులను పరామర్శించిన చంద్రబాబు



అమరావతి: రాష్ట్రంలోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు పర్యటిస్తున్నారు. ఉండవల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరిన మాజీ ముఖ్యమంత్రి పంట నష్టపోయిన రైతులను పరామర్శించి ధైర్యం చెప్పారు. నేడు తెనాలి, వేమూరు, బాపట్ల నియోజకవర్గాల్లో పర్యటిస్తారు. రాత్రికి బాపట్లలోనే బస చేస్తారు. పర్యటనకు వెళ్తూ దారిలో దేవేంద్రపాడు వద్ద నిరసన చేస్తున్న రైతులను చూసి ఆగి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా రైతులు ఆయనతో తమ ఆవేదనను పంచుకున్నారు. పంట నష్టం అంచనాకు ప్రభుత్వం ఇంతవరకు రాలేదని చెప్పారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజల కష్టాలు మరో మూడు నెలల్లో తొలగిపోతాయని హామీ ఇచ్చారు. తాను పర్యటిస్తున్నానని జగన్ హడావుడిగా బయల్దేరారని విమర్శించారు. పొలాల్లో ఉండి రైతుల కష్టాలు తెలుసుకోవాల్సిన మంత్రులు ఎక్కడని నిలదీశారు. పంటబీమా ప్రీమియం కూడా చెల్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## వైసీపీ ఫిర్యాదుతో స్పందించిన ఎలక్షన్ కమిషన్..



అమరావతి: ఆంధ్రప్రదేశ్ లో ప్రస్తుతం ఓటర్ల జాబితా పంచాయతీ నడుస్తోంది.. రెండు ప్రధాన పార్టీలు వైఎస్సార్ కాంగ్రెస్,తెలుగుదేశం ఓట్ల గల్లంతు ,నకిలీ ఓట్లపై వరుస ఫిర్యాదులు చేస్తున్నాయి. తమ పార్టీ సానుభూతిపరుల ఓట్లు తొలగించేస్తున్నారంటూ.. ఇరు పార్టీలు సీఈఓ ముకేష్ కుమార్ మీనాకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తున్నాయి.ఇదంతా ఒక ఎత్తయితే డబుల్ ఎంట్రీ ఓట్ల సమస్య మరొకటి. తెలంగాణలో ఎన్నికలు ముగియడంతో అక్కడ ఓటు వేసిన వారు తిరిగి ఆంధ్రప్రదేశ్‌లో ఓటు వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ప్రధానంగా అధికార పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ ఆరోపిస్తుంది. ఒక వ్యక్తి దేశంలో ఒకే చోట ఒక్క ఓటు మాత్రమే ఉండాలనేది తమ పార్టీ అభిమతంగా చెబుతుంది. ప్రజాస్వామ్యంలో ఇష్టానుసారం ఎక్కడపడితే అక్కడ ఓటు వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతోంది. ఇదే అంశంపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేష్ కుమార్ మీనాకు పలుమార్లు వైఎస్సార్ సీపీ నేతలు ఫిర్యాదు చేసారు.రాష్ట్రంతో పాటు తెలంగాణ, కర్నాటకలో కూడా కొంతమంది ఓటు హక్కు కలిగి ఉన్నారని. అలాంటి ఓట్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు పూర్తికావడంతో అక్కడ ఉన్న లక్షలాది మంది ఆంధ్రప్రదేశ్‌కి చెందిన సెటిలర్లు తిరిగి ఏపీలో ఓటు వేసేందుకు ప్రయత్నిస్తున్నారని సీఈవోకు ఫిర్యాదు చేశారు. (మిగతా 3లో..)

## మిజోరం ముఖ్యమంత్రిగా లాల్దుహోమా ప్రమాణస్వీకారం

మిజోరం: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ఆ రాష్ట్ర



ముఖ్యమంత్రిగా జోరం పీపుల్స్ మూవ్‌మెంట్ పార్టీ అధినేత లాల్దుహోమా ప్రమాణస్వీకారం చేశారు. ఐజ్వాల్‌లోని రాజ్‌భవన్ కాంప్లెక్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు జెడ్‌పీఎం ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇటీవలే జరిగిన మిజోరం అసెంబ్లీ ఎన్నికల్లో 40 స్థానాలకు గానూ 27 నియోజకవర్గాల్లో జోరం పీపుల్స్ మూవ్‌మెంట్ పార్టీ గెలుపొంది, సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించిన విషయం తెలిసిందే. 74 ఏండ్ల వయసున్న లాల్దుహోమా.. ఐపీఎస్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. గోవా, ఢిల్లీలో ఆయన ఐపీఎస్‌గా పని చేశారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ సెక్యూరిటీ ఇంచార్జి ఆఫీసర్‌గా కూడా పని చేశారు. అదే సమయంలో రాజకీయాలకు ఆకర్షితుడైన లాల్దుహోమా తన ఐపీఎస్ పదవికి రాజీనామా చేశారు. రాజకీయాల్లోకి వచ్చి 1984లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఇప్పుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు.




# నవజాత శిశువులకు నాణ్యమైన వైద్యం..

**శిశు మరణాలు కట్టడిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి**



అమరావతి, : నవజాత శిశువులకు ప్రైవేటులో వైద్య ఖర్చులు లక్షల్లో ఉంటాయి. రెండు రోజులు ఎన్ఐసీయూ (న్యూ బోర్న్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ లో ఉంచితే లక్ష రూపాయలు అదే వారం అయితే రూ.3 నుంచి రూ.5 లక్షలు ఖర్చవుతోంది. నెలలు నిండకుండా పుట్టిన బిడ్డల వైద్య కోసం రూ.10 లక్షల పైనే ఖర్చు చేసిన తల్లిండ్రులు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఇంతటి ఖరీదైన వైద్యాన్ని ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితంగా అందిస్తున్నారు. కార్పొరేట్‌కు మించిన సౌకర్యాలతో స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ అందుబాటులోకి తెచ్చారు. బిడ్డ పుట్టిన తరువాత ఊపిరి తిత్తులు పూర్తిస్థాయిలో రూపుదిద్దుకొనేందుకు అవసరమైన రూ.15 విలువగల ఇన్‌జంక్షన్‌ను ఉచితంగా అందిస్తున్నారు. గర్భిణీ ఆవర నెల ఏడవ నెలలో డెలివరీ అయిన శిశువులను కాపాడుకొనేందుకు లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. సుమారు 5 లక్షలు ఖరీదైన వైద్యాన్ని విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితంగా అందిస్తున్నారు. దీంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవం అయి సమస్య ఎదురైన వారు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరి ఉచిత వైద్యసేవలు పొందుతున్నారు.రూపాయి ఖర్చు లేకుండా కార్పొ'రేట్'కు మించిన వైద్యాన్ని ఉచితంగా అందిస్తుండటం నవజాత శిశువుల పాలిట వరంలా పరిణమించింది. రాష్ట్రంలో శిశు మరణాల నివారణే లక్ష్యంగా సీఎం జగన్ ప్రభుత్వం గడిచిన నాలుగున్నరేళ్లలో తీసుకున్న చర్యలు ఫలించాయి. మహిళ గర్భం దాల్చిన నాటి నుంచి పండంటి బిడ్డకు జన్మనిచ్చి, ఆ బిడ్డ పూర్తి ఆరోగ్యంగా ఇంటికి చేరుకునే వరకూ అడుగడుగునా ప్రభుత్వం చేయిపట్టి నడిపిస్తోంది. ఇందుకోసం ప్రభుత్వాసుపత్రుల్లో పీడియాట్రిక్ (చిన్న పిల్లల) వైద్య విభాగాలను బలోపేతం చేస్తోంది.వార్డుల్లో ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చుడంతో పాటు, పూర్తిస్థాయిలో వైద్యులను, సిబ్బందిని నియమించింది. దీంతో.. టీడీపీ ప్రభుత్వ హయాం తో పోలిస్తే స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్స్ (ఎస్ఎన్‌సీయూ)లో శిశు మరణాల రేటు ఇప్పుడు గణనీయంగా తగ్గింది. 2018–19లో ఎస్ఎన్సీయూల్లో ప్రతి వెయ్యి జననాలకు శిశు మరణాల రేటు 12.3గా ఉండగా 2019 నుంచి సీఎం జగన్ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఈ మరణాల రేటు క్రమంగా తగ్గుతూ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య 6.6కు తగ్గింది.

భారీగా పెంచిన పడకలు.

నవజాత శిశు మరణాల నియంత్రణా చర్యల్లో భాగంగా ప్రభుత్వాసుపత్రుల్లో నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఎసీ యూ)లలో పడకలను వైద్యశాఖ 2019కు ముందు.. రాష్ట్రంలో 62 ఎస్ఎన్సీయూల్లో 585 పడకలు అందుబాటులో ఉండేవి. వీటికి అదనంగా వార్డులను ఏర్పాటుచేస్తూ 755కు ప్రభుత్వం పడకలకు పెంపొందించింది. మరోవైపు.. 2023–24 ఆర్థిక సంవత్సరంలో శిశు సంరక్షణ కేంద్రాల బలోపేతం చేపట్టింది. భాగంగా 11 ప్రభుత్వాస్పత్రుల్లో 20 పడకల చొప్పున, మరో 8 ఆస్పత్రుల్లో 10 పడకల ఎన్ఏసీయూ నాలుగు ఆస్పత్రుల్లో 20 పడకల చొప్పున ఎన్ఏసీయూ ఏర్పాటు చేసింది. వీటిల్లో వైద్యసేవలు అందించడానికి 250 మంది వరకూ వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఇతర సహాయ సిబ్బంది పోస్టుల భర్తీ చేపట్టారు. సీప్యాప్, ఫొటోథెరపీ యూనిట్, రేడియంట్ వార్మర్, ఇతర అత్యాధునిక పరికరాలను సమకూర్చారు. ఈ యూనిట్లలో త్వరలో వైద్యసేవలు ప్రారంభించనున్నారు.

తప్పిన తిప్పలు

పూర్తిస్థాయిలో ఈ మరణాలను నియంత్రించడానికి వైద్యశాఖ చర్యలు చేపడుతోంది. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అనతికాలంలో ఎస్ఎన్సీయూల్లో శిశు మరణాలను గణనీయంగా నియంత్రించిన రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇటీవల కేంద్రం సైతం అభినందించింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో వైద్య విప్లవం ప్రారంభమైంది. ఫ్యామిలీ డాక్టర్ల విధానంతో పల్లె ప్రజలకు మెరుగైన వైద్య సేవలు చేరువయ్యాయి.రాష్ట్ర వ్యాపితంగా 10,032 విలేజ్ హెల్త్ క్లినిక్స్ ఏర్పాటు చేశారు. దీంతో పల్లె ప్రజలు వైద్య కోసం పట్టణాలకు పరుగులు తీయాల్సిన అవస్థలు తప్పాయి. మతా శిశు సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం ఏఎన్ఎంలు, సీహెచ్ఓల ద్వారా గర్భిణీ దశ నుంచే ప్రత్యేక వైద్య సేవలు అందిస్తోంది. క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించడంతో తల్లి బిడ్డల ఆరోగ్యం భద్రంగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఉత్తరాంధ్రపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలోనే హైరిస్క జిల్లాగా విశాఖ జిల్లాను గుర్తించిన ఆరోగ్య శాఖ ఉమ్మడి విశాఖ జిల్లా పై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రతి ఏటా అల్లూరి జిల్లాలో పదుల సంఖ్యలో మాతా శిశు మరణాల ప్రభావం అధికంగా ఉండడంతో ఆయా కేసులన్నీ రెఫరల్‌గా విశాఖ కేజిహెచ్ తరలిస్తూ ఉంటారు కేజీహెచ్ కు వచ్చే నవజాత శిశువులకు పూర్తిస్థాయిలో మెరుగైన వైద్యం అందజేసేందుకు అన్ని చర్య లు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే హెచ్పీసీఎల్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద 80 లక్షలతో రూపాయలతో ప్రత్యేకంగా ఈ వార్డుకు సంబంధించి అవసరమైన అన్ని రకాల వైద్య పరికరాలను వెంటిలేటర్లను ప్రత్యేక పడకలను ఏర్పాటు చేశారు.

గతం కంటే భారీగా తగ్గిన శిశు మరణాలు

ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతిష్టాత్మక చర్యల్లో భాగంగా అన్ని ఆసుపత్రుల్లో స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్స్ తో పాటునియోనాటిల్ ఇంటెన్స్ కేర్ యూనిట్ ఏర్పాటు చేయడంతో గతం కంటే ప్రస్తుతం శిశు మరణాల సంఖ్య భారీగా తగ్గింది. గతంలో ఏడాదికి 40 నుంచి 50 వరకు ఉంటే ప్రస్తుతం వాటి సంఖ్య పది నుంచి 20 కి చేరిందని కేజీహెచ్ పీడియాట్రిక్స్ వైద్యులు తెలుపుతున్నారు. పూర్తిస్థాయిలో వచ్చిన పరికరాలను వినియోగించుకుంటూ శిశు మరణాలను తగ్గించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

**ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు**



బాపట్ల జిల్లా ప్రజపాలన డిసెంబర్ 8: బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం లోని నా ప్రాదేశిక నియోజకవర్గం అయిన నల్లమోతు వారి పాలెం పరిధిలోని కొత్త నందాయ పాలెం గ్రామ రైతుల తో పాటు చుట్టుపక్కల ప్రాంతాలలో తుఫాన్ కారణంగా నష్టపోయి కష్టాలలో ఉన్న రైతులను పరామర్శించి, కొండంత ధైర్యాన్ని నింపి నేను ఉన్నాను అనే భరోసా ఇచ్చిన గౌరవ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డికి నా ప్రాదేశిక నియోజకవర్గం లోని ప్రజలు అందరి తరపున ధన్యవాదాలు తెలియ జేస్తున్నాను. గౌరవ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయటానికి అహర్నిసలు కష్టపడిన బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా కి మరియు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తో పాటు జిల్లా అధికారులు అందరికీ కూడా ధన్యవాదాలు తెలియ జెస్తున్నాను. ముఖ్యంగా అహర్నిశలు కష్టపడటమే కాకుండా రాత్రుళ్ళు కూడా ఇల్లు వాకిలి కుటుంబాలను ఒదిలి మండల ప్రజల సేవలో తరించిన కర్లపాలెం మండల అభివృద్ధి అధికారి దాసరి రాంబాబు గారితో పాటు మండల పరిషత్ అధికారులు అందరికీ కూడా ప్రత్యేకమైన ధన్యవాదాలు. కర్లపాలెం మండలం రెవెన్యూ అధికారి గారికి మరియు మండలం లోని రెవెన్యూ సిబ్బంది అందరికీ కూడా ధన్యవాదాలు. ముఖ్యంగా బాపట్ల జిల్లా లోని పోలీస్ వారు తుఫాన్ సమయంలో ప్రజలను చైతన్య పరచటం లో చూపించిన చొరవ అనిర్వచనీయం. బాపట్ల సర్కిల్ పోలీస్ వారికి ముఖ్యంగా కర్లపాలెం ఎస్ఐ గారికి కూడా ప్రత్యేకమయిన ధన్యవాదాలు తెలియ జేస్తూ..ముఖ్యమంత్రి పర్యటనను దిగ్విజయం చేసిన బాపట్ల ప్రజలకు శిరస్సు వంచి నమస్కారాలు తెలియ జేస్తూ తాండ్ర సాంబశివరావు,ఎంపీటీసీ నల్లమోతువారి పాలెం ప్రెసిడెంట్, ఎక్స్ సర్వీస్ మెన్ అసోసియేషన్ బాపట్ల జిల్లా.

# సీఎం జగన్ పాలనలో సంతోషంగా ప్రజలు

**రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు**



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రజలందరూ పూర్తి సంతోషంగా ఉన్నారని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 36 వ డివిజన్ 196 వ వార్డు సచివాలయం పరిధిలో శుక్రవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ బాలి గోవింద్, పార్టీ శ్రేణులతో కలిసి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రామకోటి మైదానం నుంచి పాదయాత్ర ప్రారంభించి బావాజీ పేట 1, 2 రోడ్లలో విస్తృతంగా పర్యటించారు. దాదాపు 271 ఇళ్లను సందర్శించారు. ప్రతి గడపకి వెళ్లి మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, కార్మికులు ఇలా అన్నివర్గాల ప్రజలను పేరుపేరునా పలకరిస్తూ, జగనన్న సంక్షేమ పథకాలు అందుతున్న తీరుని అడిగి తెలుసుకున్నారు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే కార్యక్రమాలు చేపడుతున్నారని ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. సచివాలయ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో 5 కోట్ల 44 లక్షల 69 వేల 769 రూపాయల సంక్షేమాన్ని డీబీటీ ద్వారా అర్హులైన వారందరికీ అందించినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోన్న సంక్షేమ కార్యక్రమాలు తమ జీవితాలలో వెలుగులు నింపుతున్నాయని ఈ సందర్భంగా ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి మరో 30 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు పులపా కృష్ణ, రామకృష్ణ, రెడ్యాం ఆర్కే, రాద భాస్కర్, యడ్ల రాంబాబు, పఠాన్ భూపతి, ఇప్పిలి శ్రీను, పప్పుల శివ, తాటి శివ, పార్టీ శ్రేణులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# బాబన్న ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏ ఈ ఎల్ సి ఏజెన్సీ ఫీల్డ్ క్రిస్మస్



గోకవరం ప్రజాపాలన డిసెంబర్ 8 మండలం మల్లవరం సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చ్ లో సిహెచ్ లూథర్ ఫెడ్రిక్(బాబీ అన్నా) ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏ.ఈ.ఎల్. సి ఏజెన్సీ ఫీల్డ్ క్రిస్మస్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమమునకు తూర్పుగోదావరి సినడ్ భిషప్ రెవరెండ్ డాక్టర్ ఏ శామ్యూల్ రాజు అధ్యక్షత వహించినారు. వారు మాట్లాడుతూ గోకవరం మండలంలోనే ప్ర ప్రథముగా మారుమూల ప్రాంతమైన మల్లవరం గ్రామంలో ఏ ఈ ఎల్ సి ఏజెన్సీ ఫీల్డ్ క్రిస్మస్ జరుపుకోవడం చాలా ఆనందదాయంగా ఉన్నదని, ప్రపంచమంతటా జరుపుకునే ఏకైక పండుగ క్రిస్మస్ అని.క్రిస్మస్ అంటే క్రీస్తును ఆరాధించడం అని, ఆయనను ఆరాధించువారు ఆత్మతోను,సత్యముతోను ఆరాధించవలెనని,ఏసు జననం నకు సంబంధించిన అనేక మర్మములతో కూడిన వాక్య సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విచ్చేసినటువంటి ఏ ఈ ఎల్ సి సీనియర్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ సిహెచ్.ఎస్.టి. కృపారావు,ఏ ఈ ఎల్ సి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ సిహెచ్ మాణిక్యాలరావు మాట్లాడుతూ ఏజెన్సీ ఫీల్డ్ లో సుమారుగా 30 సంఘాలు ఉన్నాయని, యాజకుల శ్రేయస్సుకు, సంఘ పరిచర్యకు సినడ్ తరపున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నామని,కూడి వచ్చిన మీ అందరికీ ఈస్ట్ గోదావరి సినడ్ పక్షంగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమము దేవునికి మహిమ కరముగా, మనందరికీ ఆశీర్వాదకరంగా జరగడానికి సహకరించిన స్థానిక పేరిష్ పాస్టర్ రెవరెండ్ మాండ్రు దాసు,పేరిష్ డెలిగేట్ యాళ్ళ రవి విజయ్ కుమార్,ట్రెజరర్ యాళ్ళ అబ్రహం పాల్,పిసిసి మెంబర్స్ కు,స్త్రీల సమాజం వారికి,యూత్ వారికి,సండే స్కూల్ పిల్లలకు దేవుని పేరట వందనాలు,కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ ఫీల్డ్ పాస్టర్లు,పాస్టరమ్మలు,సి. ఆర్ లు,పేరిష్ డెలిగేట్స్, భారీ సంఖ్యలో సంఘస్తులు పాల్గొన్నారు.

# అందరికీ అండగా ఉంటా..

(మొదటి పేజీ తరువాయి)

స్వర్ణముఖి గండి పడిన చోటిని చూశానని, స్థానికుల కోరికపై శాశ్వత పరిష్కారం కింద రూ.30 కోట్లతో బ్రిడ్జిని నిర్మించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆపై వేదిక వద్ద కొందరు బాదితులతో మాట్లాడి వారినుంచి వినతి పత్రాలను స్వీకరించారు.

అంతకుముందు రేణిగుంట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్ లో కోట మండలం కేంద్రం విద్యానగర్ మైదానం చేరుకున్నారు. ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వెంట జిల్లా ఇంచార్జి మంత్రి అయిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, కె.నారాయణ స్వామి, రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత, జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి వున్నారు. విద్యానగర్ హెలిప్యాడు చేరుకున్న ముఖ్యమంత్రికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి గోవర్ధన్ రెడ్డి, నెల్లూరు జిల్లా కలెక్టర్ యం.హరి నారాయణ, తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి, తిరుపతి పార్లమెంట్ సభ్యులు యం.గురుమూర్తి, నెల్లూరు జిల్లా జడ్పీ ఛైర్ పర్సన్ అరుణమ్మ, ఎమ్మెల్సీ లు యం.మురళి, కల్యాణ చక్రవర్తి, పి.చంద్ర శేఖర్ రెడ్డి, ఎమ్మెల్యేలు సత్యవేడు – గూడూరు, సూళ్లూరుపేట, ఆత్మకూరు, ఆదిమూలం, వరప్రసాద్, సంజీవయ్య, విక్రమ్ రెడ్డి –వెంకటగిరి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇంచార్జి రామ్ కుమార్ రెడ్డి, తదితరులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు.

# తుఫాన్ ద్వారా పంటలు నష్టపోయిన రైతులను గుర్తించాలి

**సర్వేను త్వరితగతిగా పూర్తి చేయాలని అధికారులు ఆదేశించిన జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్**



ముసునూరు, డిసెంబర్ 08, ప్రజాపాలన ప్రతినిధి: మిచౌంగ్ తుఫాన్ ద్వారా పంటలు నష్టపోయిన రైతులను గుర్తించడానికి, వారికి పెట్టుబడి రాయితీ అందించడానికి పాటించవలసిన విధి విధానాలను ప్రభుత్వం జీవో.ఎంఎస్.నెం.5, ది.14-11-2023 ద్వారా ఇచ్చిందని మండల వ్యవసాయాధికారి ఎస్ మధుమోహన్ పేర్కొన్నారు. మండలంలోని చెక్కపల్లి గ్రామంలో శుక్రవారం పంట నష్టం వివరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జీవో ద్వారా వరి, వేరుశనగ, పత్తి, చెరకు, మిరప, కూరగాయలు, పుచ్చ, పూల తోటలు, బొప్పాయి పంటలకు ఒక హెక్టారుకు రూ.17,000, మొక్కజొన్నకు ఒక హెక్టారుకు రూ.12,500, అపరాలైన మినుము, పెసర, పొగాకు కు ఒక హెక్టారుకు పదివేల రూపాయలు పెట్టుబడి రాయితీగా అందిస్తారని తెలియజేశారు. ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు మండల స్థాయిలోని ఎమ్మార్వో, ఎంఏవో, ఎంపీడీవో టీంను, గ్రామస్థాయిలో వీఆర్వో, విఏఏ, విహెచ్ఏ, పంచాయతీ సెక్రెటరీలను కలిపి గ్రామ సాయి కమిటీలుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామస్థాయి కమిటీలు ది.10-12-2023(ఆదివారం) సాయంత్రం లోపు పంట నష్టం వివరాలను అంచనవేసి నిర్ణయత ఫార్మేట్లో నింపిన తర్వాత, మూడు రోజులు ప్రతి ఆర్బికే కేంద్రాలలో ప్రదర్శనకు ఉంచి రైతుల నుండి ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించాలన్నారు. స్వీకరించిన అభ్యంతరాలను ఒక రోజులోనే పరిష్కరించాలన్నారు. తుది జాబితాలను తర్వాత రెండు రోజుల్లోపు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి సమర్పిస్తామన్నారు. కాబట్టి గ్రామస్థాయి కమిటీలు నిర్ణయిత గడువు లోపు పంట నష్టం సర్వేను పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

# విద్యార్థి దశ నుండి అవినీతిపై పోరాడాలి

**అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం**

**ఏలూరు జిల్లా సమాచార హక్కు చట్టం జిల్లా కోఆర్డినేట్ కమిటీ సభ్యులు అయ్యంకి సురేష్ బాబు**



నూజివీడు, డిసెంబర్ 08, ప్రజాపాలన ప్రతినిధి: నూజివీడు నియోజకవర్గ పరిధిలోని మండల కేంద్రమైన ఆగిరిపల్లి గ్రామంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం ఏలూరు జిల్లా కోఆర్డినేట్ కమిటీ సభ్యులు అయ్యంకి సురేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి అవినీతిరహిత సమాజానికై పోరాడాలన్నారు. సమాచార హక్కు చట్టం–2005 పై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రభుత్వ సేవలలో అలసత్వం లేకుండా చట్ట ప్రకారం కార్యాలయాల నుండి సేవలు పొందటం ప్రతి పౌరుని హక్కుగా గుర్తించాలన్నారు. ఇందుకోసం సమాచార హక్కు చట్టం ఎంతగానో దోహదపడుతుందని సోదాహరణంగా వివరించారు. అనేక చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సయ్యద్ లాల్ సాహెబ్ మాట్లాడుతూ నిత్యజీవితంలో ప్రతి ఒక్కరూ వినియోగించే వస్తువులలో నాణ్యత లోపించినా, నష్టం వాటిల్లినా వినియోగదారులైన ప్రజలు 2019 చట్టం ద్వారా జిల్లా వినియోగదారుల ఫారం ను సంప్రదించి చట్ట ప్రకారం నష్టాన్ని తిరిగి పొందవచ్చునన్నారు. ఇలా ప్రతి పౌరుడు అవగాహనతో మెసిలితే కంపెనీ యాజమాన్యాలు, ఆయా సంస్థలు నాణ్యతతో కూడిన సేవలు అందించేందుకు ముందుకు వస్తాయని అన్నారు. ఇండియన్ గ్యాస్ కంపెనీ మేనేజింగ్ పార్ట్నర్ పాలడుగు శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత భారతీయ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వ పాలనలో, ప్రభుత్వ కార్యాలయాలలో ప్రశ్నించిన నాడు పారదర్శకత ఏర్పడి అవినీతి అదుపు కాగలదు అన్నారు. సామాజికవేత్త పాతూరి రవి, మల్లెల శ్రీను లు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే గ్రామస్థాయి నుండి సమాజం పట్ల అవగాహన పెంపొందించుకొని, స్వార్థం వీడి సమాజ శ్రేయస్సు పట్ల ప్రణాళికాబద్ధంగా ముందడుగులు వేయాలన్నారు. సత్ప్రవర్తనతో విద్యార్థులు నడుచుకొని రేపటి తరానికి దిశా నిర్దేశం చేయగలిగిన గొప్ప మేధావులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపల్ కూరపాటి యోహాన్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజం పట్ల భారతీయ చట్టం పట్ల అవగాహన పెంపొందించుకొని అన్ని రంగాలలో ముందడుగు వేయాలన్నారు. లంచాలు ఇవ్వడాన్ని, ప్రేరేపించడాన్ని కూకటి వేళ్లతో పెకలించి వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉద్యమకారులు లంకపల్లి ఎంకోజి, సత్తు కోటేశ్వరరావు, చెమట శ్రీనివాసరావు, దొండపాటి దినేష్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## తన దగ్గరికి వచ్చిన సమస్యలను తక్షణం స్పందించి పరిష్కరించే దశగా పనిచేస్తున్న కార్పొరేటర్ గోదావరి గంగ



ఎన్టీఆర్ జిల్లా ప్రజాపాలన ప్రతినిధి :విజయవాడ పశ్చిమ నియోజకవర్గం. మిచౌంగ్ తుఫాన్ నేపథ్యంలో భారీ వర్షాల వలన 47వ డివిజన్ కొండ ప్రాంతంలో డివిజన్లో స్థానిక ప్రజలు .చెట్లు. కరెంట్ తీగల. పైపడి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నట్టు ఆయా ప్రాంత ప్రజలు ఈ విషయాలను స్థానిక కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా కార్పొరేటర్ గోదావరి గంగ తక్షణ సంబంధిత అధికారులతో తెలియచేసిన వెంటనే స్పందించి ఆయా విభాగాల అధికారులను సిబ్బంది ని వెంటనే పంపి ఆయా సమస్యలను పరిష్కరించారు ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గోదావరి బాబు. సచివాలయ కన్వీనర్ రెడపంగు క్రాంతి కుమార్. సిబ్బంది పాల్గొన్నారు

# దైవజనులచే కేక్ కట్ చేయించిన టిడిపి ఇన్చార్జి నరేంద్ర వర్మ

### దైవజనులకు సేవ చేసే అవ కాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా

### తెలుగుదేశం పార్టీ బాపట్ల నియోజకవర్గ ఇంచార్జ్ వేగేశన నరేంద్ర వర్మ

### ఆ ప్రభువు ఆశీస్సులు ప్రజలందరి పై ఉండాలి

### వేగేశన ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



బాపట్ల జిల్లా ప్రజపాలన డిసెంబర్ 8: జన స్వరం : లోక రక్షకుడైన ఆ ప్రభువు ఆశీస్సులు ప్రజలందరి పై ఉండాలని, దైవ జనులకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని, తెలుగుదేశం పార్టీ బాపట్ల ని యోజకవర్గ ఇంచార్జ్ వేగేశన నరేంద్ర వర్మ స్పష్టం చేశారు. బాపట్ల రైల్వే స్టేషన్ వద్ద,సూర్య కాళీ ఫంక్షన్ ప్లాజాలో, వేగేశన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన, దైవజనుల సెమీ క్రిస్మస్ 2023 వేడుకలలో, ముఖ్య ప్రసంగీకులు మృత్యుంజయ దైవసందేశం అందించారు. ఈ కార్యక్రమం లో బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జ్ వేగేశన నరేంద్ర వర్మ, దైవ జనులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, క్రిస్మస్ కేక్ కట్ చేసి, క్రిస్మ స్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నరేంద్ర వర్మ మాట్లాడుతూ, వేగేశన ఫౌండేషన్ ద్వారా, గత 8సంవత్సరాల నుండి అనేక సేవా కార్యక్రమా లు చేస్తున్నామన్నారు. దైవ జ నులకు సేవ చేసుకునే అవకా శం రావడం, దేవుడు నాకు ఇచ్చిన అదృష్టం అన్నారు. ఈ నెల 19వ తేదీన గ్రాండ్ క్రిస్మస్ వేడుకలను విలియం బూత్ జూనియర్ కాలేజ్ నందు నిర్వహిస్తున్నామని, అందరూ తప్పకుండా వచ్చి, ప్రభువు సందేశం విని ఆశీర్వాదం పొం దాలన్నారు. ఈ సందర్భంగా నరేంద్ర వర్మ మాట్లాడుతూ,మీ ఆశీర్వాద బలమే నన్ను ఇలా నడిపిస్తుందని, రాబోయే రోజుల్లో మీరు అందరూ నా వెంట ఉండి బలం చేకూర్చాలని కోరారు. అనంతరం గ్రాండ్ క్రిస్మస్ వేడుకల పోస్టర్ లను ఆవిష్కరించారు. దైవ జనులం దరికి దుస్తులు పంపిణి చేసి, కానుకలు అందజేశారు. అనం తరం దైవ జనులకు ప్రేమ విం దు ఏర్పాటు చేశారు. కార్య క్రమంలో నియోజకవర్గ దైవ జనులు, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ ను కలిసి అభినందించిన ఆజాద్ ముస్లిం కమిటీ



ఎన్టీఆర్ జిల్లా ప్రజాపాలన ప్రతినిధి :విజయవాడ బందర్ రోడ్లో ఉన్నటువంటి ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో రెండవసారి ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ గా ఎన్నికైన షేక్ ఆసిఫ్ ను కలిసి ఘనంగా సన్మానించిన ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షులు షేక్ నాగుల్ మీరా. ఈ సందర్భంగా.ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ కు అడ్వాన్స్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన..హాఫిజ్ షేక్ సాజిద్ అలీ దువా చేస్తూ ముస్లిం మైనార్టీలకు పెద్దపీట వేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారని 2024 లో కూడా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండాలని అలాగే రానున్న రోజుల్లో ఇప్పుడు మైనార్టీ ఫైనల్స్ కార్పొరేషన్ చైర్మన్ గా ఉన్నా షేక్ ఆసిఫ్ ఎమ్మెల్యే అవ్వాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు..ఈ కార్యక్రమంలో హాఫిజ్ షేక్ సాజిద్ అలీ, షేక్ ఇమ్రాన్ , షేక్ ఇబ్రహీం పాల్గొన్నారు.

## కనిగిరిలో ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



కనిగిరి :ప్రజాపాలన ప్రతినిధి :కనిగిరి మండల విద్యాశాఖ అధికారి అధ్యక్షతన భవిత విద్యా వనరుల కేంద్రం నందు ప్రపంచ దివ్యంగుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాతలు మేకల తిరుపతయ్య, కొనకనమిట్ల గ్రామ వాస్తవ్యులు మేకల సౌజన్య మేకల రాజమ్మ దివ్యాంగ విద్యార్థులకు స్వీట్స్, భోజనాలు ఏర్పాటు చేసి దుప్పట్లు పంపిణీ చేశారు. కొండయ్య (స్వామి) దివ్యాంగ విద్యార్థులకు టిఫిన్ బాక్సులు అందజేశారు. ప్రతాప్ ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, మండల విద్యాశాఖ అధికారి డివి సుబ్బారావు, ఎండిఓ ఉడుముల నారాయణరెడ్డి, డాక్టర్ పెరుగు మురళి, మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్ మాణిక్యరావు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు అబ్రహం లింకన్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మను దర్శించుకున్న ముఖ్యమంత్రి కార్యదర్శి ముత్యాలరాజు దంపతులు ఈవో రామారావు



ఎన్టీఆర్ జిల్లా ఇంద్రకీలాద్రి:ప్రజాపాలన ప్రతినిధి :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యుల కార్యదర్శి రేవుముత్యాలరాజు ఐ.ఏ.ఎస్ దంపతుల వారు శ్రీ అమ్మవారి దర్శనార్థం ఆలయమునకు విచ్చేయగా ఆలయకార్యనిర్వహణాధికారి కె ఎస్ రామరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ అమ్మవారి దర్శనం కల్పించారు. శ్రీ అమ్మవారి దర్శనానంతరము వీరికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ ఈ వో వారు శ్రీ అమ్మవారి ప్రసాదము, శేషవస్త్రం, చిత్రపటం అందజేసినారు.

## వైసీపీ ఫిర్యాదుతో స్పందించిన ఎలక్షన్ కమిషన్..

(మొదటి పేజీ తరువాయి)

రెండు ప్రాంతాల్లో 4 లక్షల 30వేల 264 మందికి ఓట్లు ఉన్నాయంటూ ఆధారాలతో సహా ఎన్నికల కమిషన్ అధికారులకు వైసీపీ నేతలు ఫిర్యాదు చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వైసీపీ నేతల ఫిర్యాదుపై స్పందించిన ఎన్నికల కమిషన్ జిల్లాల కలెక్టర్లకు పలు ఆదేశాలు జారీ చేసింది. డబుల్ ఎంట్రీ ఓట్లపై ఫిర్యాదులు వచ్చిన చోట పరిశీలన చేయాలని కలెక్టర్లను ఆదేశించారు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి మీనా.

తెలంగాణలో ఓటువేస్తే ఏపీలో వేసేందుకు నో చాన్స్..

డబుల్ ఎంట్రీ ఓట్ల రచ్చ కొంతకాలంగా నడుస్తోంది. ముందుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అంశాన్ని లేవనెత్తింది. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. దీంతో ఏపీలో ఓటు వేసేందుకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని ప్రగతి నగర్లో క్యాంప్ ఏర్పాటు చేశారు. ఇలా చేయడం సరికాదంటూ ఎన్నికల కమిషన్ కు వైసీపీ మంత్రులు ఫిర్యాదు చేశారు. ఇలాంటి బోగస్ ఓట్లను ఏరివేయాలని కోరారు .అటు చంద్రబాబు కూడా సరైన ఆధారాలుంటే డబుల్ ఎంట్రీలను తొలగించాలని సీఈఓకు లేఖ రాశారు. ఈ వివాదం కొనసాగుతుండగానే ఎన్నికల కమిషన్ కలెక్టర్లకు సూచనలు చేయడం చర్చగా మారింది. 1950 ప్రజాప్రాదినిధ్య చట్టం సెక్షన్ 17,18 ప్రకారం ఒక వ్యక్తి ఒకచోట మాత్రమే ఓటర్ గా నమోదు చేయించుకోవాలి. ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు కలిగి ఉండకూడదని ఈసీ పేర్కొంది. ఒకవేళ తనకు ఓటు ఉందనే విషయాన్ని దాచి పెట్టి కొత్తగా ఓటు కోసం నమోదు చేసుకున్నట్లయితే సెక్షన్ 31 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్లకు ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొంది. ఇటీవల కొత్తగా ఓటు హక్కు నమోదు కోసం ఫారం -6 లను ఎక్కువగా ఉపయోగిస్తున్నారని.. దీనికి కూడా కొన్ని నిబంధనలున్నట్లు ఈసీ పేర్కొంది.

ఫారం - 6ను మొదటిసారి ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు మాత్రమే ఉపయోగించాలని, అంతకు ముందు ఓటు ఉంటే దాన్ని మార్పు చేసుకోవడం కోసం ఫారం - 8 మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేస్తోంది. ఫారం - 6 ద్వారా కొత్తగా ఓటు హక్కు కల్పించాలంటే క్షేత్రస్థాయి పరిశీలన తప్పనిసరని ఈసీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నిబంధనల ప్రకారం ఎక్కడైతే రాజకీయ పార్టీల నుంచి డబుల్ ఎంట్రీ ఫిర్యాదులు వస్తాయో అటువంటి వాటిపై తప్పనిసరిగా పర్యవేక్షణ అవసరం అని కలెక్టర్లకు ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈసీ తాజా ఆదేశాలతో తెలంగాణలో ఓటు వేసి తిరిగి ఏపీలో ఓటు వేయాలనుకునే వారిపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించనున్నారు.అయితే ఫిర్యాదులు వచ్చిన చోట మాత్రమే ఇది సాధ్యపడుతుందని చెబుతున్నారు అధికారులు.

## రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆరు లక్షల మంది ఆరెకటిక సంఘీయులు జనసేన టీడీపీ కు అండగా నిలవాలి: పోతిన మహేష్



ఎన్టీఆర్ జిల్లా ప్రజాపాలన ప్రతినిధి :విజయవాడ పశ్చిమ ఆరే కటిక కృష్ణాజిల్లా సంఘీయులు తాడేపల్లి కొండపావులూరి గార్డెన్స్ లో ఏర్పాటు చేసుకున్న ఏడవ కార్తీక వన సమారాధన మరియు సత్యనారాయణ స్వామి వ్రతాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న జనసేన పార్టీ విజయవాడ నగర అధ్యక్షులు రాష్ట్ర అధికార ప్రతినిధి మరియు పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జి పోతిన వెంకట మహేష్.ఈ సందర్భంగా మహేష్ ఆరెకటిగా సంఘీయులను ఉద్దేశించి మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి పార్టీ ఏర్పాటు చేసిన ఆరెకటిగా కార్పొరేషన్ వల్ల ఉపయోగం లేదని ఈ కార్పొరేషన్ లో కూడా ఆరేకటిగా కులస్తులను కాకుండా వేరే సామాజిక వర్గం వారికి అధిక ప్రాధాన్యమిచ్చారని రాబోయే ఎన్నికల్లో జనసేన టిడిపి కూటమికి అండగా నిలవాలని వైసిపి కి బుద్ధి చెప్పాలని ఆరెకటిక సామాజిక వర్గం వారు రాజకీయంగా ఉన్నతంగా ఎదగాలని తప్పక పవన్ కళ్యాణ్ ద్వారా వీరికి అన్ని రకాలుగా ప్రాధాన్యత ఉండేలా కృషి చేస్తానని ఆరెకటిగా సంఘీయులు కోరిన విధంగా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ లోకార్పొరేటర్లుగా పోటీ చేసే అవకాశం కల్పించడంతోపాటు నగరంలో 1000 గజాల స్థలం కేటాయించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్సీ పదవి అంశాన్ని కూడా పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కి మరియు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు దృష్టిలో ఉంచుతానని హామీ ఇచ్చినారు. అనంతరం మహేష్ ను సాబిన్కర్ నరేష్ ఉమామహేశ్వరరావు భక్తవత్సలం సాయి తదితరులు సత్కరించినారు. ఈ కార్యక్రమంలో ఆర్య కటిక సంఘ నాయకులు జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్ర పోస్టర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే దొరబాబు..



పిఠాపురం, ప్రజాపాలన ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను పిఠాపురం ఎమ్మెల్యే పెండం దొరబాబు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, వార్డు స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఐదు అంచెలుగా నిర్వహించే పోటీలలో ప్రతిఒక్క క్రీడాకారుడూ పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. ప్రభుత్వం క్రీడాకారులకు మంచి భవిష్యత్తును కల్పించాలన్న సంకల్పంతో ఈ నిర్ణయం తీసుకుందన్నారు. గ్రామీణప్రాంత క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకుంటే అందుకు తగిన క్రీడా సామగ్రిని కూడా పూర్తి ఉచితంగా ప్రభుత్వం అందజేస్తుందన్నారు. డిసెంబర్ 15 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్టు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో సరదాగా ఆడుకునే కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్ ఆటలను ప్రధానంగా ఇందులో పొందుపరచడం జరిగిందన్నారు. ఈ ఆటలు తెలిసిన క్రీడాకారులు పోటీలకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ..



ప్రజాపాలన ప్రతినిధి :స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తెదేపా అధినేత చంద్రబాబు బెయిల్ రద్దు కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వచ్చే ఏడాది జనవరి 19కి వాయిదా వేసింది. స్కిల్ కేసులో చంద్రబాబుకు ఏపీ హైకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. పిటిషన్‌పై గతంలో వాదనలు విన్న ధర్మాసనం.. తదుపరి విచారణను నేటికి వాయిదా వేసింది. ఇవాళ జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ సతీష్ చంద్రశర్మల ధర్మాసనం పిటిషన్‌పై మరోసారి విచారణ చేపట్టింది..

## పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకోవాలి.. రైతులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పిన.. అక్కల గాంధీ



ఎన్టీఆర్ జిల్లా.. ప్రజాపాలన ప్రతినిధి :వర్షాలు కారణంగా పంటలు నష్టపోయిన రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకోవాలి.. నష్టపోయిన రైతులు పక్షాన టిడిపి జనసేన పార్టీ అండగా ఉంటుంది.. జనసేన పార్టీ మైలవరం నియోజకవర్గం ఇంచార్జి అక్కల రామ్మోహన్ రావుతో కలిసి తుఫాన్ వచ్చి నష్టపోయిన రైతులను పరామర్శించి తడిచిన ధాన్యాన్ని పరిశీలించడం జరిగింది.వారికి ప్రభుత్వం నుండి ఇప్పటివరకు ఎటువంటి నష్టపరిహారం ఇస్తామని కానీ వచ్చి వారి పొలాలను పరిశీలించి నష్టపరిహారం అంచనా వెయ్యడం కానీ చెయ్యకపోవడం నిజంగా బాధాకరం ఇప్పటికయినా ప్రభుత్వం వారిబాదలను అర్థం చేసుకొని ఎకరానికి 50వేలు నష్టపరిహారం అందచేసి రైతుల కన్నీరు తుడవ వలసిందిగా జనసేన పార్టీ కోరుకుంటుంది. ఈ కార్యక్రమం. రైతు రైతులు మరియు సురేష్ నాని, . నాని, సుజాత, రామాంజినీయులు, గోపి, రాధా, రైతులు పాలుగోన్నారు

## ముడిపల్లి దళిత వాడలో వైస్సార్సీపీ నాయకులు బాబుకు నివాళి.



ప్రజాపాలన ప్రతినిధి : రాష్ట్ర మంత్రి సోదరులు వై.రాం ప్రసాద్ రెడ్డి నగరి మండలం ముడిపల్లి దళితవాడలో వైస్సార్సీపీ నాయకులు బాబుకు శుక్రవారం నివాళులు అర్పించారు .గత కొంత కాలంగా అనారోగ్యంతో వున్న వైస్సార్సీపీ నాయకులు బాబు గురువారం మృతిచెందారు. బాబు కుటుంబ సభ్యులను శ్రీ వై.రాంప్రసాద్ రెడ్డి పరామర్శించారు. వైస్సార్ ఆరోగ్య బీమా ద్వారా లక్ష రూపాయలు మరియురోజా చారిటబుల్ ట్రస్ట్ తరపున 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందచేశారు .ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

## సంపాదకీయం

**శనివారం 09, డిసెంబరు 2023**

# నియామకాలపై దృష్టి పెట్టాలి

నీళ్లు, నిధులు, నియామకాలు.. ఈ మూడు లక్ష్యాలపై ఏర్పాటైంది తెలంగాణ. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు కావొస్తున్న తరుణంలో నియామకాల అంశానికి ప్రాధాన్యం ఏర్పడింది. తెలంగాణలోని దాదాపు అన్ని రాజకీయ పార్టీలు నియామకాల సమస్యనే ప్రధాన అజెండాగా తీసుకున్నాయి. గత నెల రోజులుగా ప్రతిపక్షాలు సైతం ఇదే అంశంలో ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నాయి. నవంబర్ 30న జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ నిరుద్యోగం, నియామకాల అంశం ప్రధాన ప్రచార అస్త్రంగా మారింది. దాదాపు 80 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఏడాది కిందట బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించింది. వరుస నోటిఫికేషన్లను టిఎస్‌పిఎస్‌సి, పోలీసు నియామక మండలి విడుదల చేశాయి. ఈ క్రమంలో రెండు నెలల కిందట వెలుగు చూసిన టిఎస్‌పిఎస్‌సి పేపర్ల లీకేజీ వ్యవహారం నియామకాల ప్రక్రియను కీలక మలుపు తిప్పింది. దీని తర్వాత రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు నిరుద్యోగుల అంశం మీద ప్రభుత్వంపై గళమెత్తడం ప్రారంభించాయి. కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్‌లో యువ సంఘర్షణ సభ నిర్వహించి యూత్ డిక్లరేషన్ ప్రకటించి తాము అధికారంలోకి వస్తే మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాల భర్తీ, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ, జూన్ 2 నాటికి అన్ని శాఖల్లోని ఖాళీలతో జాబ్ క్యాలెండర్ ప్రకటించి, సెప్టెంబరు 17లోపు నియామకాలు పూర్తి చేయడం, సెంట్రలైజ్డ్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పోర్టల్ ఏర్పాటు, ప్రతి జిల్లాలో ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీలు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటు, ప్రభుత్వ రాయితీలు పొందిన ప్రైవేటు కంపెనీల్లో తెలంగాణ యువతకు 75 శాతం ఉద్యోగాలు ఇలా వివిధ అంశాలతో డిక్లరేషన్ ప్రకటించింది. అయితే నిరుద్యోగుల డిక్లరేషన్ వెనుక ఓట్లు ఒక్కటే కాదు, నిరుద్యోగుల సమస్యలను ఎత్తి చూపాలనే అజెండా ఉంది. తెలంగాణ ఏర్పాటు వెనుక మూడు ఉద్దేశాలు ఉన్నాయనుకుంటే నిధులన్నీ నీళ్ల కోసమే ప్రభుత్వం ఖర్చు చేసింది. కానీ నియామకాలను పట్టించుకోలేదు. దీని వల్ల నిరుద్యోగ యువత ఆందోళనలో వున్నారు. వారికి భరోసా కల్పించడం కోసమే కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ తెచ్చింది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ తరపున 2019లో జరిపిన సర్వే ప్రకారం 20 లక్షల మంది గ్రాడ్యుయేట్లు తెలంగాణలో ఉన్నట్లు అంచనా. ఇప్పుడు ఆ సంఖ్య 25 లక్షలకు చేరిందని రాజకీయ పార్టీలు వేసుకుంటున్న అంచనా. వీరితో పాటు ప్రస్తుతం గ్రాడ్యుయేషన్ దశలో మరో 5 లక్షల మంది ఉంటారు. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా 2022 గణాంకాల ప్రకారం తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ రేటు 34 శాతంగా ఉంది. ఈ విషయంలో తెలంగాణ కంటే ఎపి సహా 13 రాష్ట్రాలలో నిరుద్యోగ రేటు తక్కువగా ఉంది. తెలంగాణలో పట్టణ ప్రాంతాలకు వచ్చేసరికి నిరుద్యోగ రేటు 65 శాతంగా ఉన్నట్లు ఆర్‌బిఐ అంచనా వేసింది. అంతకు ముందు 2019- 20 ఏడాదిలో 97 శాతంతో పోల్చితే ఇది తక్కువగా ఉంది. తెలంగాణ కంటే 16 రాష్ట్రాలల్లో నిరుద్యోగ రేటు తక్కువగానే ఉంది. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ 80,039 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు గతేడాది మార్చి 9న అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. మరో 11,103 మంది కాంట్రాక్టు ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చారు. దీనికి సంబంధించిన ఫైలుపై ఇటీవల కొత్త సెక్రటేరియట్ ప్రారంభోత్సవం రోజున ముఖ్యమంత్రి కెసిఆర్ సంతకం చేశారు. ప్రకటించిన 80,039 ఉద్యోగాలల్లో ఏ మేరకు భర్తీ చేశారన్నది తెలీదు. ప్రభుత్వ రంగంలో 2 లక్షల 20 వేల ఉద్యోగాలు, ప్రైవేటు రంగంలో 22 లక్షలకు పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. గత తొమ్మిదేళ్లలో తెలంగాణను ఉపాధి కల్పనలో నంబర్ వన్ స్థానంలో నిలిపాం. నిరుద్యోగాన్ని పెంచి పోషించినందుకు కాంగ్రెస్, బిజెపిలే క్షమాపణలు చెప్పాలి అని ముఖ్యమంత్రిగా అప్పుడు కెసిఆర్ అన్నారు. టిఎస్‌పిఎస్‌సిలో ప్రశ్న పత్రాల లీకేజీ వ్యవహారం కారణంగా గ్రూప్-1 ప్రిలిమ్స్‌ు, ఎఇ, డిఎఒ పరీక్షలను రద్దు చేయగా, మరికొన్ని పరీక్షలను వాయిదా వేశారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులందరూ అప్పట్లో భాగస్వాములైంది నియామకాల కోసమే. ఏళ్ల తర్వాత జాబ్ నోటిఫికేషన్లు ఇచ్చినా లీకేజీ వ్యవహారంతో నియామకాలు సరిగా జరగలేదు. వీటికి పరిష్కారం దొరకాలంటే అసలు టిఎస్‌పిఎస్‌సిలో రాజకీయ జోక్యం ఉండకూడదు. పైరవీల అవకాశం లేకుండా శాశ్వత ఉద్యోగులను నియమించాలి. అనుభవం ఉన్న వారిని నియమించి నోటిఫికేషన్లు జారీ చేసి పరీక్షలను నిర్వహించాలి. తల్లిదండ్రులు అప్పులు తెచ్చి పిల్లలను కోచింగ్‌కు పంపిస్తున్నారు. నిరుడు ప్రకటించిన ఉద్యోగ నియామక ప్రకటనల్లో దాదాపు 17 వేల ఉద్యోగాలు పోలీసు శాఖవే ఉన్నాయి. అవి ముందుకు సరిగా సాగలేదు. నిరుద్యోగులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత కొత్త ప్రభుత్వంపై ఉంది. రాష్ట్రం ఏర్పడిన ఆరున్నరేండ్ల తర్వాత తొలి మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నియామకం జరిగింది. దీనిని బట్టే మహిళల రక్షణ, వాళ్ల అభివద్ధిపై మన చిత్తశుద్ధి ఏంటో అర్థమైపోతోంది. నేడు రాష్ట్రంలో యాక్సిడెంట్లు, హత్యలు, అత్యాచారాలు ఇలా ఏ నేరం జరిగినా వాటిలో ఇతర కారణాలు ఓ వైపు అయితే సగానికి పైగా నిందితులపై లిక్కర్ ప్రభావం ఉంటోందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ నేరాలు తగ్గాలంటే ముందు లిక్కర్ కంట్రోల్ చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాలు లిక్కర్‌ను ఆదాయం తెచ్చే మార్గంగా చూడకుండా ఆల్టర్‌నేటివ్స్ ఆలోచించాలి. తెలంగాణ వ్యాప్తంగా 17,634 బెల్ట్ షాపులున్నాయి. ఈ బెల్ట్ షాపులన్నీ మూసివేసేందుకు నడుం బిగించాలి. ఈ బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మకాల మూలంగానే రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్య లు అధికమవుతున్నాయి. క్రమంగా రాష్ట్ర వ్యాప్తంగా వైన్ షాపుల సంఖ్యను కూడా తగ్గించేలా ప్రభుత్వాన్ని కోరాలి. అలాగే మహిళలపై జరుగుతున్న దాడులకు మూలాలను గుర్తించి, అసలు ఆ నేరప్రవత్తి పెరగకుండా చేసేందుకు తీసుకోవాల్సిన చర్చలపై దృష్టి పెట్టాలి. సెమినార్లు, వర్క్ షాపులు నిర్వహించి మహిళల సమస్యల పట్ల సమాజంలో అవగాహన కల్పించాలి. పరిష్కార మార్గాలు సూచించాలి. ఇందులో ఏ పని జరగాలన్నా మహిళా కమిషన్‌కు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందాలి. నిరుద్యోగ సమస్యను రాజకీయ అవకాశాలను సృష్టించే సమస్యగా కాకుండా, ఉపాధి కల్పన ప్రభుత్వాల బాధ్యతగా భావించాలి. ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను క్రమం తప్పకుండా భర్తీ చేయడం, ఉపాధిని కల్పించే పరిశ్రమలకు ప్రాధాన్యత ప్రోత్సాహకాలు ఇవ్వటం, స్వయం ఉపాధి కార్యక్రమాలను చేపట్టడం నైపుణ్యాలను పెంచడం లాంటి చర్యల ద్వారా కొంత మేరకు నిరుద్యోగ సమస్యకి పరిష్కారం చూపించే అవకాశం ఉంది. కానీ ప్రభుత్వ ప్రాధాన్యతా క్రమంలో ఉపాధి, ఉద్యోగాల కల్పన ప్రధానమైన అంశంగా మారనంత కాలం నిరుద్యోగానికి పరిష్కారం దొరకదు.

**సామాజిక దృక్పథంతో మీరు రాసే రచనలు**
editor. prajapalana@gmail.com
**మెయిల్ కు పంపించినచో ప్రజా పాలన**
**దినపత్రికలో ప్రచురించబడును**

# అస్తమించని సూర్యుడు అంబేడ్కర్

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అస్తమించని మేధో సూర్యుడు. అంబేద్కర్‌కి పూర్వం, అంబేద్కర్ తర్వాత భారతదేశాన్ని మనం లిఖించాల్సి ఉంటుంది. అంబేద్కర్‌కి పూర్వం భారతదేశం మనస్మృతి రాజ్యం, వర్ణ వ్యవస్థ రాజ్యం, బ్రాహ్మణాధిపత్య రాజ్యం, లౌఖికేతర రాజ్యం, అప్రజాస్వామిక రాజ్యం, నియంతృత్వరాజ్యం. డా॥బి.ఆర్ అంబేద్కర్ జన్మించిన పది సంవత్సరముల నుండి భారతదేశం రూపురేఖలను మార్చేయడానికి ఆయన కృషి చేసి లౌఖిక ప్రజాస్వామిక సామ్యవాద దేశంగా మార్చివేశారు. ఆయన శిల్పించిన దేశమే భారతదేశం. ఆయన భారత రాజ్యాంగ శిల్పంలో ప్రపంచ మానవతా సూత్రాలన్నీ ఇమిడి ఉన్నాయి. లౌకిక భావన ప్రజాస్వామ్య వ్యవస్థలలోని స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంలను భారత రాజ్యాంగం ద్వారా భారత ప్రజలకు లభించడానికి కారకులయ్యారు. కులాతీత మతాతీత రాజ్యాంగాన్ని రూపొందించి భారతదేశానికి కానుకగా సమర్పించారు. భారతదేశ భవిష్యత్తుకు ఆ రాజ్యాంగమే దిక్సూచి. డా॥బి.ఆర్.అంబేడ్కర్ ప్రపంచంలోనే పేరెన్నికగన్న మేధావి. తత్వవేత్త, మేధావి, దార్శనికుడు అని ఎవరని అంటారు. ప్రపంచ సూత్రాలను మార్చ గలిగిన వారినే అంటారు. అంబేద్కర్‌కు ముందు ఒక బుద్ధుణ్ణి, ఒక మార్క్స్‌ను ప్రజలు తత్వవేత్తగా కొనియాడారు. అంబేద్కర్ బుద్ధుని కంటే, మార్క్స్ కంటే కూడా విశిష్ట లక్షణాలు వున్న మేధావి. భారతదేశాన్ని పట్టి పీడిస్తున్న కుల సమస్యకు, అస్పృశ్యతల నిర్మూలనకు నిర్మాణాత్మకమైన సిద్ధాంతాలు, సూత్రాలు అందించిన మేధావి ఆయన. అణగారిన ప్రజల హక్కులకు సిద్ధాంత రూపాన్నేగాక, చట్ట రూపాన్ని తీసుకొచ్చిన నిర్మాణకర్త ఆయన. దళితుల విముక్తి చట్టాలేగాక, చట్టాల రూపకల్పన సామర్థ్యం కోసం రాజ్యాధికారం కూడా ఎలా అవసరమో నిగ్గు తేల్చిన ప్రయోక్త అంబేద్కర్. డా॥ అంబేద్కర్ పరినిర్మాణం చెంది 67వ సంవత్సరంలో అడుగు పెడుతున్నా ఆయన కీర్తి తరగలేదు. ఆయన సిద్ధాంతాలు విశ్వవ్యాపితమవ్వడానికి కారణం, ఆయన జీవితం అంతా అనంత పరిశోధన చేసి, కుల నిర్మూలన, అస్పృశ్యతా నిర్మూలనం, ఆర్థిక అసమానతల నిర్మూలనకు బాటలు వేయడమే అని మనకు అర్థం అవుతుంది. ఆయనలా విశుద్ధంగా, నిర్మలంగా, ద్వేష రహితంగా జీవించిన మేధావులు అరుదు. ఆయన భారత రాజ్యాంగ నిర్మాణాన్ని భారతదేశ పునర్నిర్మాణ దృష్టితో రూపొందించారు. అందుకు ఆయన తన ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి రాశారు. డా॥బి.ఆర్ అంబేద్కర్ సుందరమైన, నాగరికమైన లండన్ నగరంలో తన జీవితాన్ని ఒక విద్యాపిపాసిగా గడపడంలో విజ్ఞతను చూపారు. ఆయన లండన్ నగరాన్ని అంతరంగికంగా ఎక్కువ చూశారు. ఆయన రాజ్యాంగం రాయటానికి ఆ అంతర్ దృష్టి ఎంతో ఉపయోగపడింది. నగరాలు ఎలా ఏర్పడ్డాయి? నాగరికతలు ఎలా ఏర్పడ్డాయి? చారిత్రకంగా వాటి ప్రాధాన్యత ఏమిటి? అవి అని ఎప్పుడు ఎలా అత్యున్నత స్థాయికి వెళ్ళాయి? ఎలా శైథిల్యమయ్యాయి? అందుకు గల అంతరంగిక బహిరంగ కారణాలు ఏవి? ఈ దృష్టితో అంబేద్కర్ తను నివసించిన నగరాలను చూశారు. ఆయన లండన్‌లో కూడా మాన్‌టేగ్, విఠల్‌బాయ్ పటేల్ వంటి వారితో మాట్లాడే సందర్భంలో కూడా అస్పృశ్యుల సమస్యను మరువలేదు. అంటే ఆయన విద్యార్జన గమ్యం అస్పృశ్యుల ఉద్ధరణ. అదీ దళిత విద్యావంతులలో వుండాల్సిన ఆదర్శం. దళిత విద్యార్థులు ఆ నిర్దేశత నుండి తప్పితే అంబేద్కర్



మార్గాన్ని నిరోధించిన వారే అవుతారు. ఈ సత్యాన్ని ప్రతి అంబేద్కర్‌వాది గుర్తుంచుకోవాలి. ఆయన లండన్‌లో వున్నప్పుడు కూడా ఆయన మనస్సు భారతదేశ అస్పృశ్య సమాజం మీదే వుండేది. భారతదేశంలో అస్పృశ్యుల కోసం పనిచేస్తున్న సంఘాలు ఏమి చేస్తున్నాయని ఆయన ఎప్పటికప్పుడు తెలుసుకొంటూ వుండేవారు. అంబేద్కర్ విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలను సంతరించుకున్నారు. నాయకుడు కేవలం తన వ్యక్తిగత జీవితం గురించి ఆలోచించడు. తన జాతి గురించే ఆలోచిస్తాడు. త్యాగపూరితంగా పనిచేయడం ద్వారా వారి మనసులను చూరగొంటాడు. నాయకుడు తన భావజాలాన్ని జాతికి అందించడానికి వాహికను రూపొందించుకుంటాడు. అది ఉత్తరాల ద్వారా కావచ్చు, పత్రికల ద్వారా గావచ్చు, సభలు, సమావేశాల ద్వారా గావచ్చు. ఆ సందేశం వ్యక్తిగతమైంది కాక, స్వార్థపూరితమైంది కాక జాతి శ్రేయస్సుకొరకు అయితే ఆ జాతి ప్రజలు ఆ నాయకుడిని గుర్తిస్తారు. అతని కృషికి శత్రువులు సైతం అవలోకిస్తారు. అందుకే నాయకుని జీవితం జాతికి నిరంతర పఠనీయ గ్రంథం అవుతుంది. అంబేద్కర్ నిశిత పరిశీలకుడు. ముఖ్యంగా ఆయన పోరాటానికి పునాది ఆయన పూర్వీకుల త్యాగ నిరతి. అందుకే పూర్వీకుల వీరోచిత గాథలను ఆయనే ఇలా అభివర్ణించాడు. ఆయన క్రమశిక్షణతో కూడిన నిర్భయత్వాన్ని ప్రదర్శిస్తూ వీరోచితమైన సాహసాన్ని, మొక్కవోని నిబ్బరాన్ని, ధైర్యాన్ని కొనియాడదగిన నిశ్చితత్వాన్ని ప్రదర్శించి వారు మహర్ సైనికులకి శాశ్వతమైన గుర్తింపును తెచ్చారు. ఇద్దరిలో ఎవరి కీర్తి గొప్పదో చెప్పడం కష్టం. అది భారతీయ సైనికులదో లేక అంతటి విధేయతను, విశ్వాసాన్ని పొందేలా వ్యవహరించిన బ్రిటీష్ ఆఫీసర్లదా? (భారతీయ సైనికులలో అధికులు మహర్లు) అంటూ మేజర్ జె.టి.గోర్మన్ తన హిస్టారికల్ రికార్డే ఆఫ్ ది సెకండ్ బెటాలియన్ ఫోర్త్ బాంబే గ్రెనెడీర్స్, 1796-1933లో పేర్కొన్నారు. ఆనతి కాలంలోనే కోరెగాంవ్ చర్యకున్న ప్రాముఖ్యతను గుర్తించారు. కోరెగాంవ్‌లో మొదటి తూటా పేలిన స్థలంలో 65 అడుగుల ఎత్తు, 32 చదరపు అడుగుల వెడల్పు వున్న స్మృతి చిహ్నాన్ని నిర్మించాలని తలపెట్టారు. దీనికి 1821 మార్చి 26న పునాది రాయి వేశారు. ఈ దళం సాహసానికి స్మృతిగా ఈ స్థూపాన్ని నిర్మించారు. ఈ సాహసాన్ని కొనసాగించే ఉద్దేశంతో దీనిని నెలకొల్పారు. ఈ చిహ్నంపై యుద్ధ క్షేత్రంలో మరణించిన, గాయపడిన వారి పేర్లను చెక్కాలని నిర్ణయించారు. 'భారతీయ సైన్యానికి' అని చెక్కిన ప్రత్యేక మెడల్ 1851లో జారీ అయింది. 'కిర్కీ' 'కోరెగాంవ్' జ్ఞాపకార్థం ఆ మెడల్ రెండు వైపులా వారి పేర్లు చెక్కారు. బాంబే ఆర్మీ ఆపరేషన్లలో మహర్లు పాల్గొనడం కొనసాగించారు. వారికి వృత్తిపట్ల అచంచలమైన నిబద్ధత, సాహసాలను ఇది రుజువు చేస్తోంది. వారు కథియవార్ (1826) ముల్తానం, గుజరాత్ (1849), కాందహార్ (1880) యుద్ధ క్షేత్రాలలో తమ సాహసోపేతమైన పోరాటంతో గొప్ప పేరు ప్రఖ్యాతులను సంపాదించారు. మొదటి, రెండవ అఫ్ఘాన్ యుద్ధాలలో, మియానీ యుద్ధం (1843), పెర్షియా యుద్ధం (1856-57)లో బాంబే ఆర్మీ పాల్గొన్నది. ఈ సేనలకు చెందిన సైనికులు చైనా (1860) ఆడెన్ (1865), అబిసీనియా (1867)లకు వెళ్ళారు. తన నేతృత్వంలో సింధ్‌పై సాధించిన విజయంలో 25 బాంబే నేటివ్ ఇన్‌ఫాంట్రీ (పదాతి దళం) చేసిన సాహసాలను జనరల్ సర్ ఛార్లెస్ నేపియర్ మరువలేదు. అస్పృశ్యులు వీరోచితమైన జాతులు అని అంబేడ్కర్ తన అస్పృశ్యులవాడలో నిరూపించారు. పల్నాటి యుద్ధంలో తెలుగు నేలలో దళితులే పాల్గొన్నారు. కృష్ణ దేవరాయల సైన్యంలో ఏనుగులను, గుర్రాలను నడిపింది దళితులే. ముఖ్యంగా పల్నాటి వీర చరిత్రలో కన్నమదాసు సైన్యాధ్యక్షుడు ఆయన ఉపయోగించిన కత్తి ఇప్పటికి కారంపూడిలో వుంది. దళితులు అస్పృశ్యులు కాదని నిరూపించాడు. డా॥ అంబేద్కర్ కృషి వలన అస్పృశ్యత ఒక నేరంగా రాజ్యాంగం పరిగణిస్తూ వుంది. కాని భారతదేశంలో లక్షలాది గ్రామాలలో ఇంకా అస్పృశ్యత వెన్నాడుతూనే వుంది. ఎన్నో హోటళ్ళలో గ్లాసులు అస్పృశ్యులకు వేరుగా వుంచుతున్నారు. ప్రభుత్వం పనిగట్టుకొని ఊరికి దూరంగా ఇళ్ళు కట్టిస్తూ అస్పృశ్యతను ఆచరిస్తూ వుంది. రాజ్యాంగనీతి నేతిబీర సూక్తిగా మిగులుతూ వుంది. డా॥అంబేద్కర్ రాజ్యాంగ చర్చల సందర్భంగా సోషలిస్టు సిద్ధాంతాల నుండి రాజ్యాంగం రూపొందిందనీ శాసనాధికారం నుండి సోషలిజాన్ని సాధించాలని పేర్కొనడం జరిగింది. కాని ఆచరణలో ధనస్వామిక శక్తుల అభివృద్ధికి ప్రభుత్వం పాటుపడుతూ వుంది. భారత రాజ్యాంగంలో 21వ ఆర్టికల్‌ను వివరిస్తూ డా॥అంబేద్కర్ "ప్రభుత్వ సొమ్మును మత బోధకులకు, మత కార్యకలాపాలకు ఉపయోగించరాదు. మత బోధలకు సంబంధించి స్వయంగా లేక ప్రయివేటు సంస్థల ద్వారా ప్రభుత్వం ఖజానా డబ్బును ఖర్చు చేయడానికి వీలులేదు" అని స్పష్టం చేసారు. దీనికి పూర్తిగా, భిన్నంగా ఈనాడు జరుగుతూ వుంది. ప్రభుత్వ ప్రచార సాధనాలయిన రేడియో, టి.వి., మొదలయిన వాటిలో మత ప్రచారం చేయడం రాజ్యాంగ విరుద్ధం. ఆనాడు డా॥అంబేద్కర్ వివరించిన దానికి పూర్తి భిన్నంగా జరుగుతూ వుంది. సెక్యులరిజమంటే "మత ప్రమేయం లేని రాజ్యం' అని అర్థము. ఈనాడు ప్రభుత్వం పూర్తిగా మతపరంగా వ్యవహరిస్తూ వుంది. ఇది భారత రాజ్యాంగ శిల్పి డా॥ అంబేద్కర్‌కు, ఆయన ఆలోచనలకు పూర్తిగా వ్యతిరేకమయిన విషయం. అందుకే రానురాను అంబేద్కర్ యొక్క అవసరం పెరిగింది. అయితే ప్రపంచ వ్యాప్తంగా ఆయనను మేధావిగా గుర్తించడమే కాక ఆయన ఆర్కిటెక్చర్ పెరిగింది. ఈ రోజున లండన్ లోని ఇండియన్ హౌస్‌లో ఆయన బంగారు విగ్రహం వుంది. లండన్ పార్లమెంట్ ఎదురుగా ఆయన నిలువెత్తు విగ్రహం వుంది. ఇండియన్ పార్లమెంట్ ఎదురుగా కూడా ఆయన నిలువెత్తు విగ్రహం వుంది. ఇవాళ హైద్రాబాద్ నడిబొడ్డులో అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం వెలుగులీనుతుంది. ఈ రోజు విజయవాడ నడిబొడ్డులో 125 అడుగుల విగ్రహం జనవరి 14వ తేదిన ఆవిష్కరించబడుతుంది. ఈ నిర్మాణమంతా ఆయన రాజ్యాంగ నిర్మాణ దక్షతకు, ప్రతిభ సామర్థ్యానికి ఆయన సాంస్కృతిక విప్లవ పతాకగా గుర్తిస్తున్న సందర్భంగా కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు ఆయన విగ్రహాలు కుల, మతాలకు అతీతంగా లౌకికవాద భావనకు నిలువెత్తు సాక్ష్యంగా నిరంతరం వెలుస్తూనే వున్నాయి. ఈనాడు ఆయన భావజాల విప్లవం కూడా అవసరం. మనమందరం ఆయన వర్ధంతికి నివాళిగా ఆయన సిద్ధాంతాలైన కుల నిర్మూలనా, అస్పృశ్యతా నివారణా, ఆర్థిక సమత, మానవ హక్కుల పోరాట దీక్షలతో బహుజన సాధికారిత రాజ్యాధికార భావనలతో ముందుకెళ్ళాల్సిన చారిత్రక సందర్భమిది. అందుకే ఈ వర్ధంతికి ఆయన వెలుగుల బాటలో నడుద్దాం. సమతా సామ్రాజ్యాన్ని నిర్మిద్దాం.



**కత్తి పద్మారావు.**

# అరుణ చంద్రుడు..

చైతన్య జీవనదులన్నీ
కలిసిన సంగమంలా
చెమట నెత్తురు కన్నీటితో
ఎగసిపడే ఎర్రసముద్రాన్ని
నేను చూసాను
నినదించే
జనజాగత పతాకాలను చూసాను
ఆ ఎర్రమందారం తోటనా
గుండెల్లో పూచింది
ఈ కార్తీక పౌర్ణమి రోజు
అరుణవర్ణ చంద్రుడు ఉదయించాడు
కార్మికులు కర్షకులంటే
ఈ నేలతల్లి చేతిలో కంకీ కొడవలి
ఆ కొడవలి వరికోతలే కాదు
అవినీతి అణచివేత రాజ్యహింస
అహంకారాలను కోయగలదు
గాజాలో కనిపించిన విధ్వంసమైతే
భరతభూమిలో అధికారం
అగుపించని మందుపాతర
స్వేఛ్ఛను మానవహక్కులను పాతరేస్తూ
కార్మికులు కర్షకులు
దేశానికి రెండు కళ్ళైతే
కనుగుడ్లు బయటకొచ్చి
నెత్తురోడుతున్న భరతమాత
అన్యాయాలపై అక్రమాలపై
అవినీతి రాజ్యంపై తిరగబడే
ఆ శ్రమ పాదముద్రలకు
కదిలే అగ్నిపూల చెట్లకు
ఎగిరే ఆ నెత్తుటి జెండాలకు
నా లాల్ సలామ్
ఇప్పుడు దేహాలు హదయాలే కాదు
దేశమే యుద్ధభూమిలో
మన చేతిలో ఓట్లే బోయీలై
ప్రజాస్వామ్యాన్ని పల్లకిలో ఊరేగిద్దాం!



– నరికొండ నరసింహరాజు

# లక్ష్మణేశ్వరంలో తెదేపా భవిష్యత్తుకు గ్యారంటీ



నరసాపురం, డిసెంబర్ 8 (ప్రజాపాలన ప్రతినిధి) : తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం శనివారం నరసాపురం మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో నిర్వహించారు. నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు పార్టీ నాయకులతో కలిసి ఈకార్యక్రమంలో పాల్గొని గ్రామంలోని ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ అమలు చేయనున్న భవిష్యత్తుకు గ్యారంటీ బాబు ష్యూరిటీ పథకంలోని అంశాలను ప్రజలకు వివరించారు. భవిష్యత్తుకు గ్యారెంటీ బాండ్లను ప్రజలకు అందజేశారు. రాష్ట్రం అన్ని రంగాలలోనూ అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఘనవిజయం చేకూర్చాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు వాతాడి ఉమా మహేశ్వరరావు, ఎంపీటీసీ శీలం హరికృష్ణ, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్నదాతను ఆదుకోండి..

### రైతు అధ్యక్షుడు చింతల రామకృష్ణ



గోకవరం ప్రజా పాలన డిసెంబర్ 8: గోకవరం మండలంలో మిచౌంగ్ తుఫాను వల్ల నష్టపోయిన రైతాంగానికి న్యాయం చేయాలని గోకవరం మండల తేదేపా రైతు అధ్యక్షుడు చింతల రామకృష్ణ డిమాండ్ చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. వైకాపా ప్రభుత్వం అధికారం చేపట్టిననాటి నుండి రైతుకు కష్టాలే మిగిలాయని, ఏనాడు రైతు కళ్ళల్లో ఆనందం కనబడలేదని అన్నారు. మిచౌంగ్ తుఫాన్ వల్ల రైతులు పీకల్లోతు కష్టాల్లో ఉన్నారని వారిని మరింత ఇబ్బందులకు గురిచేయొద్దని రామకృష్ణ అన్నారు. తడిసిన ధాన్యం కొంటామని గొప్పలు చెప్పిన వైకాపా సర్కార్ ఇప్పుడు కొనడం లేదని, తడిసిన ధాన్యాన్ని కొనలేనప్పుడు ఇక మొలకలు వచ్చిన ధాన్యాన్ని ఇంకెప్పుడు కొంటారని, పొలాల్లో మోకాళ్ళ లోతు నీరు ఉంటే ధాన్యం ఆరబెడితేనే కొంటామనడం ఎంతవరకు న్యాయం అని రామకృష్ణ ప్రశ్నించారు. కష్టాల్లో ఉన్న రైతును ఆదుకోవడం మానేసి రోజుకో మాట చెబుతూ వైకాపా పిల్లిమొగ్గలు వేస్తుందని రామకృష్ణ ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. రైతు కష్టాల్లో ఉంటే,అధికార యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని రామకృష్ణ అన్నారు. అధిక మొత్తంలో వరి పంటకు నష్టం వాటిల్లిందని, అధికారులు మాత్రం ఇప్పటివరకు పంట పొలాలకు వచ్చిన జాడలేదని రామకృష్ణ అన్నారు. అధికారులు త్వరితగతిన పంట నష్టం అంచనా వేసి తక్షణమే రైతులకు న్యాయం చేయాలని రామకృష్ణ అధికారులను డిమాండ్ చేశారు. వైసీపీ నాయకులు హంగు, హార్భటాలు మాని, నష్టపోయిన రైతాంగానికి ఏ విధంగా మేలు చేయాలో ఆలోచించాలని రామకృష్ణ తెలిపారు.

# యువత అన్ని రంగాలలోనూ ముందంజ వేయాలి



నరసాపురం, డిసెంబర్ 8 (ప్రజాపాలన ప్రతినిధి) : యువత అన్ని రంగాల్లోనూ ముందుకు సాగాలని వారు సమాజంలో గౌరవ ప్రదమైన స్థానంలో రాణించాలని ప్రభుత్వ చీఫ్ విప్, శాసనసభ్యులు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శనివారం స్థానిక చీఫ్ విప్ కార్యాలయంలో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద రాజు పట్టణంలోని ఒకటి, రెండు వార్డులకు చెందిన యువతకు ఆడుదాం ఆంధ్ర కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా ఇది అందరి ఆటని దీనిని యువత సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. డిసెంబర్ 15 నుండి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ఆడుదాం ఆంధ్ర పేరుతో నిర్వహించనున్న క్రీడా సంబరాలు చక్కటి స్ఫూర్తిని నింపేలా సాగాలని గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలికి తీయడానికి ఇవి ఉపయోగపడాలని అన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి జగనన్న ప్రభుత్వం అతి పెద్ద యూత్ ఫెస్టివల్ నిర్వహించ బోతోందని గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడా సంబరాలు నిర్వహించనున్నామని అన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ ఆటల ద్వారా యువత ప్రతిభను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై మనవాళ్లు పోటీ పడేలా తీర్చి దిద్దడం, క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే ఆడుదాం ఆంధ్ర లక్ష్యమని డిసెంబర్ 15న మొదలై 50 రోజులపాటు కొనసాగనున్న ఈ క్రీడా సంబరాలకు మన రాష్ట్రానికి చెందిన 15 ఏళ్లు నిండిన యువతీ, యువకులు అందరూ అర్హులేనని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీ వెంకటరమణ జయరాజు, కౌన్సిలర్లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# మినీ వాటర్ ఫౌంటెన్ నిర్మాణానికి శంకుస్థాపన



జగ్గయ్యపేట డిసెంబర్ 8 ప్రజా పాలన ప్రతినిధి పట్టణంలో స్థానిక ప్రభుత్వ హస్పటల్ నందు ప్రధాన ద్వా రం వద్ద 12 లక్షల రూపాయలతో నూతనంగా ఏర్పా టు చేయనున్న వాటర్ ఫౌంటెన్ నిర్మాణ పనులకు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకు లు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ బాబు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావు శంకుస్థాపన చే శారుఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వి ప్ సామినేని ఉదయభాను కృషితో పట్టణ అభి వృద్ధి ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామన్నారు. దానిలో భాగంగా హాస్పటల్ అభివృద్ధితోపాటు సుందరీకరణ కు కూడా అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఇ ప్పటికే ఇన్ ఔట్ గేట్లు నిర్మాణం, అంతర్గత సిసి రోడ్లు, క్యాంటీను తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు తె లిపారు. 12 లక్షల రూపాయలతో అందంగా నిర్మించ బోయే ఈ ఫౌంటెంట్ నిర్మాణం త్వరితగతన పూర్తి చే సి అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుంద న్నారుఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకు లు, అధికారులు పాల్గొన్నారు.

# మిచౌంగ్ తుపాను తో నష్టపోయిన రైతులు, కౌలు రైతులను తక్షణమే ఆదుకోవాలి



నూజివీడు, డిసెంబర్ 08, ప్రజాపాలన ప్రతినిధి: మిచౌంగ్ తుపానుతో నష్టపోయిన రైతులు, కౌలు రైతులను తక్షణమే ఆదుకోవాలని మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నూజివీడు పట్టణంలోని ఎన్టీఆర్ భవన్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 48 గంటలు ఎడతెరిపిలేని వానల కారణంగా అన్ని రకాల పంటలు నష్టపోయినట్లు తెలిపారు. నష్టాల పాలైన రైతులు, కౌలు రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కౌలు రైతులకు నిబంధనల పేరుతో అందరికీ కార్డులు అందించలేదని, ప్రభుత్వ నిబంధనలను సవరించి అందరికీ నష్టపరిహారం అందించాలని కోరారు. సహేతుకమైన రీతిలో సర్వేలు నిర్వహించి, నష్టాలను అంచనా వేసి పరిహారాన్ని చెల్లించాలన్నారు. ఇతర రాష్ట్రాలు, దేశాలకు నూజివీడు ప్రాంతం నుండి అన్ని రకాల పంటలను రైతులు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

# మిచౌంగ్ తుఫాను బాధిత రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి..: పిక్కి నాగేంద్ర



ప్రజాపాలన ప్రతినిధి కొవ్వూరు: తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి, కొవ్వూరు మండలాలలో బిజెపి కిసాన్ మోర్చా బృందం పర్యటించి.. మిచౌంగ్ తుఫాను కారణంగా నష్ట పోయిన రైతులను వారి పొలాలలోనే కలిసి పంట నష్టాలను వారి ఆవేదనను ప్రత్యక్షంగా చూడడం జరిగింది. తాళ్లపూడి మండలం అన్న దేవరపేట, గజ్జరం, పోచవరం, తాడిపూడి గ్రామాలు మరియు కొవ్వూరు మండలం దొమ్మేరు, పెనకనమెట్ట గ్రామాలనోని బాధిత రైతులతో మాట్లాడడం జరిగింది. అనంతరం పోచవరం – తాడిపూడి ప్రాంతంలో కొవ్వాడ కాలువను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ.. మిచౌంగ్ తుఫాను భీవత్సంతో రైతులు కష్టాల పాలయ్యారు. భారీ వర్షాలకు చేతికి అందిన వరి పంటలు, అరటి తోటలు, కూరగాయ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పొలాలలోని వరి ధాన్యపురాసులు వర్షానికి ముద్దై మొలకలు వచ్చాయి. కొన్ని ధాన్యపు రాసులు వర్షపు నీటిలో కొట్టుకు పోయాయి. రైతులు కష్టపడి పండించిన పంటలు దెబ్బతినడంతో రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మరొక వైపు వేల ఎకరాలకు నీటిని అందించే కొవ్వాడ కాలువలో గుర్రపుడెక్క, పూడికలు తీయకపోవడం వలన మరియు తాడిపూడి ప్రాంతంలో వంతెనకు చిన్న చిన్న తూరలు మాత్రమే అమర్చడం వలన వరదల సమయంలో నీటి ప్రవాహం తగిన వేగంగా లేకపోవడంవలన ఆయా ప్రాంతాలలోని అనేక గ్రామాలలో వేల ఎకరాల పంటలు నీట మునిగి పోతున్నాయి. కొవ్వాడ కాలువ క్రింద రైతులు దశాబ్దాల కాలంగా ఇబ్బంది పడుతున్నా అధికారులు గానీ ప్రజా ప్రతినిధు లుగానీ పట్టించుకోవడంలేదు. సమస్యను సమస్యగానే గాలికి వదిలేశారు. మిచౌంగ్ తుఫాను కారణంగా తడిచిన మొలకెత్తిన వరి ధాన్యాన్ని మద్దతు ధరకు తగ్గకుండా రైతుల నుండి కొనుగోలు చేయాలని, తుఫాను బాధిత రైతులందరినీ ఆదుకోవాలని, కొవ్వాడ కాలువ సమస్య పరిష్కరించాలని అందుకు ఉన్నత అధికారులు రైతులతో కూడిన కమిటీ వెంటనే వేయాలని.. బిజెపి కిసాన్ మోర్చా రైతులు ప్రజలందరి తరుపున రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను అని పిక్కి నాగేంద్ర అన్నారు. బిజెపి అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు బూసి బెనర్జీ మాట్లాడుతూ.. తుఫాను కారణంగా నష్ట పోయిన రైతులందరికీ ఎకరానికి 20 వేల రుపాలయుల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి తిరుమలశెట్టి కృష్ణ, గోకవరపు జితేంద్ర రవి, కిల్లాని వెంకట రమణ, ఎలుగుబంటి బాలకృష్ణ, కె.సత్యనారాయణ.. తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగుల ఆశలు మరొకసారి ఆవిరి చేసిన ప్రభుత్వం

పామర్రు: ప్రజాపాలన ప్రతినిధి : పత్రికా సమావేశంలో టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు మిర్జా మాజేద్ రజా మాట్లాడుతూ..... ప్రస్తుత పరిపాలనలో ఉన్న వైసిపి ప్రభుత్వం నలుగు రేళ్ళ నాలుగున్నరేళ్ళ తర్వాత రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజలలో బాగా ఉన్నటువంటి వ్యతిరేకతను కొంతవరకు తగ్గించుకునేందుకు కార్యక్రమంలో భాగంగా లక్షల్లో ఉన్నటువంటి నిరుద్యోగులకు కేవలము పదుల సంఖ్యలో ఉద్యోగ భర్తీ నియామక ప్రకటనను విడుదల చేసింది. ఇందులో ఉన్నటువంటి పోస్టుల సంఖ్యను చూస్తే ఎక్కడా కూడా 200 పైగా పోస్టులు లేవు వివిధ కోచింగ్ సెంటర్లలో లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి బిసి ,ఎస్సి, ఎస్టీ మైనారిటీ అగ్రవర్ణ పేదలు కోచింగ్ తీసుకుంటున్నారు. వారి సంఖ్యలో వేల లో ఉంటుంది కానీ ప్రభుత్వము విడుదల చేసిన ప్రకటనలో సంఖ్యలేమో 1000 లోపుగా ఉన్నాయి. అదే విధంగా గ్రూప్ 2 నియామకాలకు సంబంధించి మెయిన్స్ పరీక్ష తేదీని ఇప్పుడు ప్రకటించలేదు. ఫలితంగా మెయిన్స్ ఉంటుందా ఉండదా అనే దానిమీద కూడా అనేక అనుమానాలు నిరుద్యోగులు వ్యక్తం చేస్తున్నారు.

ఇది కేవలము రాబోయే ఎలక్షన్లలో దృష్టిలో ఉంచుకొని విడుదల చేసినట్టుగా ఉంది తప్ప ప్రజల పట్ల నిరుద్యోగులు పట్ల అభిమానం అనేది ఎక్కడ కనిపించటం లేదు అని నిరుద్యోగులు వాపోతున్నారు.


























# వైసీపీకు ఎడ్జ్ అంటున్న సర్వేలు..



విజయవాడ, డిసెంబర్ 8, :ఏపీలో ఎన్నికలు సమీపిస్తున్నాయి. వచ్చే సంక్రాంతి తర్వాత ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఏపీలో ఎన్నికల నగారా మోగనుంది. గెలుపు కోసం అన్ని రాజకీయ పక్షాలు వ్యూహాలు రూపొందించుకుంటున్నాయి. అస్త్ర శాస్త్రాలతో సిద్ధమవుతున్నాయి. తమదే గెలుపు అని నమ్మకం పెట్టుకున్నాయి. ఈ తరుణంలో మరో సర్వే వెలుగులోకి వచ్చింది. ఏపీలో ఏ పార్టీకి బలం ఉందన్నది తేల్చేసింది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఏ పార్టీకి అత్యధిక స్థానాలు దక్కుతాయో అన్న విషయం స్పష్టంగా చెప్పుకొచ్చింది. అదే సమయంలో హోరాహోరీ ఫైట్ నడుస్తుందని కూడా ప్రకటించింది. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కలిసి నడవాలనుకుంటున్నాయి. వైసిపి మాత్రం ఒంటరి పోరుకే సిద్ధమవుతోంది. బిజెపి, కాంగ్రెస్, వామపక్షాలు ఎవరితో జత కడతాయో ఎన్నికల ముంగిట తేలనుంది. ప్రస్తుతానికి టిడిపి, జనసేన కూటమి కడతాయని తెలుస్తోంది. అందులో బిజెపి చేరే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. వై నాట్ 175 అన్న నినాదంతో వైసిపి ముందుకు సాగుతోంది. తెలంగాణ ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్ పార్టీ ఏపీ పై ఫోకస్ పెట్టే అవకాశం ఉంది. అటు వామపక్షాలు సైతం బిజెపిని విడిచిపెడితే టిడిపి, జనసేన కూటమి వైపు వచ్చేందుకు సిద్ధపడుతున్నాయి. ఇటువంటి తరుణంలో వస్తున్న సర్వేలు సంచలనం సృష్టిస్తున్నాయి. తాజాగా ఫస్ట్ స్టెప్ సొల్యూషన్ సంస్థ పోల్ స్కాన్ పేరుతో సర్వే చేపట్టింది. డిసెంబర్ 1 నుంచి రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎలాంటి పరిస్థితి ఉందని తెలుసుకునే ప్రయత్నం చేసింది. మొత్తం 2లక్షల 57 వేల శాంపిల్లను సేకరించింది. ప్రభుత్వ పాలన, ఎమ్మెల్యేల పనితీరు, నియోజకవర్గ స్థితిగతులు, మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలు వంటి అంశాలను పరిగణలోకి తీసుకున్న ఈ సంస్థ ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించింది. క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఈ సర్వే చేసినట్లు చెప్పుకొస్తోంది ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే వైసీపీ అధికారంలోకి రావడం ఖాయమని ఈ సర్వే తేల్చి చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా 113 నియోజకవర్గాల్లో వైసీపీ బలంగా ఉందని.. ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే ఆ స్థానాల్లో గెలుపొందడం ఖాయమని స్పష్టం చేసింది. 46 నియోజకవర్గాల్లో వైసీపీకి ఓటమి తప్పదని తేల్చేసింది. మరో 16 నియోజకవర్గాల్లో వైసీపీకి, టిడిపి, జనసేన కూటమికి బిగ్ ఫైట్ ఉంటుందని తేల్చి చెప్పింది. 50.10 శాతం ఓట్లతో వైసిపి ముందంజలో ఉంటుందని.. 43.12 శాతం ఓట్లతో టిడిపి జనసేన తరువాత స్థానంలో నిలుస్తాయని చెప్పుకొచ్చింది. ఇక జాతీయ పార్టీలు అయిన బిజెపి, కాంగ్రెస్ లు టు పాయింట్ జీరో ఎయిట్ శాతానికి పరిమితమవుతాయని ఈ తాజా సర్వే తేల్చేసింది. వైసీపీ విజయం ఖాయమని సర్వే చెప్పడంతో.. ఆ పార్టీ శ్రేణులు తెగ ప్రచారం చేసుకుంటున్నాయి. సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నాయి.

గుంభనంగా పార్టీలు

ఒక్క రాష్ట్రంలోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. మిగతా నాలుగు రాష్ట్రాలను బిజెపి కైవసం చేసుకుంది. అయితే ఏపీలో రాజకీయ పక్షాలు ఈ ఫలితాలపై స్పందించడానికి ముందుకు రావడం లేదు. ముఖ్యంగా తెలంగాణలో కాంగ్రెస్ విజయం పై వైసీపీ, టిడిపి, జనసేన నోరు మెదపకపోవడం విశేషం. ముఖ్యంగా ఏపీలో జాతీయ పార్టీలైన బిజెపి, కాంగ్రెస్ ఎలా ముందుకు వెళ్తాయి అన్న దానిపై చర్చ నడుస్తోంది. వైసిపి ఒంటరి పోరుకు సిద్ధమైంది. తెలుగుదేశం, జనసేన మధ్య పొత్తు కుదిరింది. అయితే ఏపీలో బిజెపి ఎవరితో కలిస్తే అవతల పార్టీతో కాంగ్రెస్ ముందుకు సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ తరుణంలో బిజెపి వ్యూహం ఏంటి? ఎవరికి సహకరిస్తుంది? మరెవరిని టార్గెట్ చేస్తుంది? అనేది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మొన్నటివరకు బిజెపి కోసం ఆరాటపడిన చంద్రబాబు.. ఇప్పుడు వ్యూహాత్మకంగా మౌనం పాటిస్తున్నారు. పవన్ మాత్రం ఎట్టి పరిస్థితుల్లో బిజెపి వస్తుందని చెబుతున్నారు. కర్ణాటక గెలిచిన కాంగ్రెస్.. ఇప్పుడు తెలంగాణలో సైతం బాగా వేసింది. అయితే తన చేతిలో ఉన్న చత్తీస్గఢ్, రాజస్థాన్లను మాత్రం కోల్పోయింది. దీంతో బిజెపి, కాంగ్రెస్ లకు ఇవి మిశ్రమ ఫలితాలే. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో హ్యాట్రిక్ కొడతామని బిజెపి నేతలు సంకేతాలు పంపుతున్నారు. కానీ ఏపీ విషయంలో ఎలా ముందుకు వెళ్తారు అన్నది ఇప్పుడు ప్రశ్న. అయితే మొన్నటి వరకు ఏపీలో ఏ పార్టీ గెలిచినా తమకు మద్దతుని ఇచ్చే వ్యూహాన్ని బిజెపి అమలు చేసింది. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో బిజెపి ఎలా ముందుకెళుతుందన్నదానిపై చర్చ నడుస్తోంది. అయితే ఎప్పటికీ తెలుగుదేశం పార్టీ శ్రేణులు బిజెపి పై ఆగ్రహంగా ఉన్నాయి. చంద్రబాబును అరెస్టు చేయించి బలహీనపరిచే ప్రయత్నం జరిగిందన్న అనుమానం ఉంది. టిడిపి, జనసేన కూటమిలోకి బిజెపి వస్తే ఓటమి తప్పదని సర్వేలు వెల్లడిస్తున్నాయి. అదే బిజెపి విడిగా పోటీ చేస్తే టిడిపి, జనసేన కూటమి విజయం సాధించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అయితే బిజెపి విడిగా పోటీ చేసి వైసిపికి లోపాయికారిగా సహకరిస్తుందా? లేకుంటే టీడీపీ, జనసేన కూటమికి సహకరిస్తుందా అన్నది చూడాలి. అయితే బిజెపి పాత్ర బట్టి.. ఏపీలో కాంగ్రెస్ వ్యూహం అనుసరించే అవకాశం ఉంది. మరి బిజెపి ఎలా ముందుకెళ్తుందో? కాంగ్రెస్ ఎటువైపుకు వెళ్తుందో? చూడాలి.

## శ్రీశైలం మల్లన్న సేవలో మంత్రి కొట్టు సత్యనారాయణ

శ్రీశైలం :కార్తీక మాసం సందర్భంగా శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవార్లను ఏపీ దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు దర్శించుకున్నారు. శ్రీస్వామి అమ్మవారి దర్శనార్థం ఆలయం వద్దకు చేరుకున్న మంత్రి కొట్టు దంపతులకు ఆలయ అర్చకులు,ఆలయ ఈవో పెద్దిరాజు సాదర స్వాగతం పలికారు. అనంతరం మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు శ్రీస్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## వైఎస్సార్ బీమా పేదలకు ధీమా..: ప్రభుత్వ విప్ సామి నేని ఉదయభాను



జగ్గయ్యపేట డిసెంబర్ 8 ప్రజా పాలన ప్రతినిధిపేదల కు సంక్షేమాన్ని అందించే క్రమంలో ఎన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గడం లే దని వైఎస్సార్ బీమా అమలులో ఈ విషయం స్పష్టంగా కనిపిస్తోంది అని ప్రభుత్వవిప్ సామినేని ఉదయ భాను పేర్కొన్నారుజగ్గయ్యపేట నియోజకవర్గం, నం దిగామ మండలం, కొణతమాత్మకూరు గ్రామానికి చెం దిన కొండిశెట్టి నాగేశ్వరరావు గారు ఇటీవల కాలంలో మరణించాడు. ఈ సందర్భంగా ప్రభుత్వం ద్వారా మంజూరైన 5 లక్షల రూపాయలను వారి కుటుంబ స భ్యులకు ఆయన అందజేశారుఈ సందర్భంగా ఉద యభాను మాట్లాడుతూ దురదృష్టవశాత్తు కొండిశెట్టి నాగేశ్వరరావు మరణించడం బాధాకరమని విచార ణ వ్యక్తం చేశారు. ఎవరైనా వ్యక్తి ప్రమాదవశాత్తు అక స్మాత్తుగా మరణిస్తే బాధిత కుటుంబాలకు భారం కా కుండా ఉండేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ భీమా పథకంను తీసుకువచ్చారని తెలి పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎల్లప్పుడూ పే దల సంక్షేమం గురించే ఆలోచించే గొప్ప మనసున్న ముఖ్యమంత్రి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు గ్రాండ్ క్రిస్మస్ అందరికీ ఆహ్వానం: కన్నబాబు



గోకవరం ప్రజా పాలన డిసెంబర్ 8: మండల కేంద్రమైన గోకవరంలో మిచౌంగ్ తుఫాన్ కారణంగా నాలుగో 6 న జరగవలసిన నియోజకవర్గ గ్రాండ్ క్రిస్మస్ వాయిదా పడిన సంగతి అందరికీ విదితమే.. తుఫాన్ ప్రభావం తగ్గడంతో నియోజవర్గ ఐక్య గ్రాండ్ క్రిస్మస్ ను డిసెంబర్ 10 ఆదివారం రోజున నిర్వహించబడుతుందని జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ఉపాధ్యక్షుడు ప్రశాంత్ కుమార్(కన్నబాబు)హలోనెన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏపీ పెంతెకొస్తు ఫెలోషిప్ అధ్యక్షులు అపోస్తల్ పి జాన్ లాజరస్, ఏపీ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు బిషప్ ప్రతాప్ సిన్హా, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు, జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, కాకినాడ జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవ.సామ్యూల్ సాగర్, ఏపీ ఏఐసీసీ అధ్యక్షులు రెవ. రైమో జుహాని హలోనెన్, ఏపీ పెంతెకొస్తు సెక్రటరీ బిషప్ మర్రి డానియేలు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని ప్రశాంత్ కుమార్ (కన్నబాబు) తెలిపారు. ఈ క్రిస్మస్ కార్యక్రమానికి జగ్గంపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి క్రైస్తవ విశ్వాసులు, క్రైస్తవ మిత్రులు అధిక సంఖ్యలో పాల్గొంటారని కన్నబాబు తెలిపారు.

## శ్రీ వేంకటేశ్వరునికి అభయహస్తం బహూకరణ



భీమవరం, డిసెంబర్ 8 (ప్రజాపాలన ప్రతినిధి) : భీమవరం పట్టణంలో కొలువైయున్న పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారికి నాలుగు లక్షల విలువైన రత్నాలు పొదిగిన వెండి అభయహస్తాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ చేతుల మీదుగా భక్తులు శుక్రవారం బహుకరించారు. పట్టణానికి చెందిన భక్తులు లక్ష్మీపతిరాజు కుటుంబీకులు శ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వెండి అభయహస్తంను శాసన సభ్యులు గ్రంధి శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. ఆలయ అర్చకులు స్వామి వారికి అలంకరించారు. శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ ముందుగా స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## శ్రీ వేంకటేశ్వరునికి అభయహస్తం బహూకరణ



భీమవరం, డిసెంబర్ 8 (ప్రజాపాలన ప్రతినిధి) : భీమవరం పట్టణంలో కొలువైయున్న పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారికి నాలుగు లక్షల విలువైన రత్నాలు పొదిగిన వెండి అభయహస్తాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ చేతుల మీదుగా భక్తులు శుక్రవారం బహుకరించారు. పట్టణానికి చెందిన భక్తులు లక్ష్మీపతిరాజు కుటుంబీకులు శ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వెండి అభయహస్తంను శాసన సభ్యులు గ్రంధి శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. ఆలయ అర్చకులు స్వామి వారికి అలంకరించారు. శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ ముందుగా స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో సామాజిక ఆరోగ్య కేంద్రం నందు అన్న ప్రసాద వితరణ



మైదుకూరు ప్రజాపాలన ప్రతినిధి:చాపాడు మండలం అల్లాడు పల్లె గ్రామానికి రియల్ ఎస్టేట్ వ్యాపారి "పెరుగు నారాయణ యాదవ్' గారి ఆర్థిక సహాయంతోమైదుకూరు సామాజిక ఆరోగ్య కేంద్రం నకు ఆరోగ్య పరీక్షలు నిమిత్తం వచ్చు గర్భిణీ మహిళలకు మరియు రోగులకు "మాత అన్న ప్రసాద వితరణ" కార్యక్రమంలో భాగంగా సుమారు130 మంది కి అన్న ప్రసాద వితరణ నిర్వహించడం జరిగిందిఈ సందర్భంగా దాత "పెరుగు నారాయణ యాదవ్" మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదనం అని అందులోను గర్భిణీ స్త్రీలకు రోగులకు అన్నదానం చేయడం మంచి కార్యక్రమం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పెరుగు నారాయణ యాదవ్,కొండపల్లి శేషగిరి రావు, గుత్తి వీర కిషోర్ యాదవ్, నారాయణ యాదవ్, వాగ్దాడం శివ శంకర్, ఇమ్మడిశెట్టి సతీష్ బాబు, సామాజిక ఆరోగ్య కేంద్ర డాక్టర్స్ మరియు సిబ్బంది లు పాల్గొన్నారు

## పెరుగుతున్న వంటింటి బిల్లు



రెండేళ్లుగా పేద, మధ్య తరగతి వర్గాలను ఎవర్ని కదిలించినా, పది మాటల్లో కనీసం రెండు మూడైనా పెరిగిన ధరల గురించే ఉంటున్నాయి. పెట్రోల్, వంట నూనె, కరెంట్ బిల్, పాల ప్యాకెట్.. వస్తువు ఏదైనా పెరుగుదల అనే పాయింట్ మాత్రం కామన్. తినడమూ, ఖర్చు పెట్టడమూ మానలేము. మన దేశంలో సామాన్యుడి భోజనం బిల్లు మళ్లీ పెరిగింది, ముద్ద మింగుడు పడడం లేదు. పెరుగుతున్న కూరగాయల రేట్లతో ఇటు శాఖాహారం, అటు మాంసాహారం రెండిటి బడ్జెట్ మారింది. నాన్-వెజ్ వండాలంటే టమాటాలు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, మిర్చి, కొత్తిమీర వంటి వెజిటేరియన్ పదార్థాలు ఉండాలి. కాబట్టి, మాంసాహారం కోసం చేసే ఖర్చు కూడా పెరిగింది.క్రిసిల్ రోటీ రైస్ రేట్ ఇండెక్స్ ప్రకారం, గత నెలలో టమాటాలు, ఉల్లిపాయల ధరలు భారీగా పెరిగాయి. ద్రవ్యోల్బణం లాంటి పెద్ద పెద్ద మాటలు వాడకుండా, ఒక సామాన్య మధ్యతరగతి ఇల్లాలి దగ్గర కూర్చుని ధరల పెరుగుదల ఆమెను ఎలా ప్రభావితం చేసిందో తెలుసుకునే ప్రయత్నం చేశాం. రాజకీయ నాయకులు తరచూ మాట్లాడే, ధర్నాలు చేసే, గ్యాస్ సిలిండర్లు నెత్తిన పెట్టుకుని, ఎడ్ల బండిపై వెళుతూ చేసే ప్రదర్శనలన్నీ ఒకవైపు.. ఆర్టీసీ బస్సులో కూర్చునో, బైక్ పై వెళ్తూనో, షేర్ ఆటోలో నుంచి తొంగి చూసి ఆ ఆందోళనకు కారణం తెలుసుకుని నిట్టూర్చే మధ్య తరగతి, పేదలు మరోవైపు.క్రిసిల్ రీసెర్చ్ డేటాను బట్టి, గత నెలలో, ఇంట్లో వండే శాఖాహార వంటల బడ్జెట్ 10% పెరిగింది. అదే సమయంలో మాంసాహారం కోసం చేసే ఖర్చు 5% పెరిగింది. విడివిడిగా చూస్తే... నవంబర్ నెలలో ఉల్లిపాయల రేట్లు 93% పెరిగాయి, టొమాటో ధరలు 15% పెరిగాయి. ధరాఘాతం వల్ల... రోటీ, అన్నం, పప్పు, కూర, పెరుగుతో కూడిన సాధారణ శాఖాహార భోజనం తయారీ ఖర్చు గత సంవత్సరం నవంబర్ నెల కంటే ఈ సంవత్సరం నవంబర్ నెలలో 9% పెరిగింది. పప్పులది వెజ్ థాలీ ధరలో 9% వాటా. వీటి రేటు కూడా గత సంవత్సరం కంటే ఇప్పుడు 21% పెరిగాయి, భోజనం భారాన్ని పెంచాయి.నాన్-వెజ్ భోజనం తయారీ ఖర్చుది కూడా ఇదే పంథా. రోటీ, అన్నం, పప్పు బదులు చికెన్ (బ్రాయిలర్), పెరుగుతో కూడిన సాధారణ మాంసాహార భోజనం ఖర్చు గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం పెరిగింది. అయితే, బ్రాయిలర్ చికెన్ రేట్లు తగ్గడం వల్ల, ఓవరాల్ రేటులో 5% పెరుగుదల మాత్రమే కనిపిస్తోంది. నాన్-వెజ్ థాలీ ధరలో బ్రాయిలర్ వాటా 50% ఉంటుంది. అందువల్లే, కూరగాయల రేట్లు పెరిగినా మాంసాహార ప్రియులకు ఉపశమనం దొరికింది. ఉల్లి, టమాటా ధరలు పెరగడానికి ప్రధాన కారణాలు రెండు. పండుగల సీజన్ కారణంగా డిమాండ్ పెరగడం, సరైన వర్షాలు లేక ఖరీఫ్ సీజన్‌లో ఉత్పత్తి తగ్గడం. ఈ ఏడాది జనవరి-మే కాలంలో ఉల్లి, టొమాటోల రేట్లు తగ్గాయి, జులై-ఆగస్టులో పెరిగాయి. ఆగస్టు నెలలో టమాటా రేట్లు చుక్కల్లోకి చేరాయి, సామాన్య జనానికి పట్టపగలే చుక్కలు చూపించాయి. టమాటా రేట్ల వల్ల ఆ నెలలో శాఖాహార భోజనం తయారీ ఖర్చు 24% పెరిగింది. అదే సమయంలో మాంసాహార భోజనం తయారీ ఖర్చు 13% పెరిగింది. ధరలు అంటే ఫస్ట్ చెప్పాల్సింది ఆయిల్. ఆయిల్ రేట్ 2019 ప్రాంతంలో 90 రూపాయలు సుమారుగా ఉండేది. తరువాత 120 అయింది. ఇప్పుడు 220 వరకూ పెరిగింది. అది మామూలు పెరుగుదల కాదు. అసలు వంట నూనె ఇంత భారీగా పెరగడం మాటలు కాదు. మూడేళ్ల క్రితం 75-80 రూపాయలు ఉండేది పెట్రోలు. ఇప్పుడు 110 అయింది. వాస్తవానికి 120 అయితే, మొన్నామధ్య పెంచి మళ్లీ 10 రూపాయలు తగ్గించారు కదా. అంటే ఏకంగా మూడేళ్లలో 30 రూపాయల పైన పెట్రోల్ పెరిగింది.

## 17 నుంచి తిరుప్పావై...



తిరుమల, డిసెంబర్ 8, :తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయంలో నెల రోజులపాటు సుప్రభాతం కాకుండా తిరుప్పావై జరగనుంది. డిసెంబరు 17 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాసం కావడంతో సుప్రభాతం స్థానంలో తిరుప్పావై సేవ జరగనుంది. తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి మాసోత్సవాల్లో అత్యంత ముఖ్యమైనదిగా భావించే ధనుర్మాసం డిసెంబరు 17 తెల్లవారుజామున 12.34 గంటలకు ధనుర్మాస ఘడియలు ప్రారంభం కానుండగా టీటీడీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. డిసెంబరు 17 ఉదయం నుంచి స్వామివారికి నిర్వహించే సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై నివేదించనున్నారు. ధనుర్మాస ఘడియలు 2024 జనవరి 14న ముగియనున్నాయి. పురాణాల ప్రకారం ధనుర్మాసంలో దేవతలు సూర్యోదయానికి గంటన్నర ముందుగా నిద్రలేచి బ్రహ్మ ముహూర్తంలో శ్రీమహావిష్ణువును ప్రత్యేకంగా ప్రార్థిస్తారట. కావున ఈ మాసానికి సౌరమానంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉండగా నెలరోజులు ఆండాళ్ తిరుప్పావై పారాయణం జరగనుంది. 12 మంది ఆళ్వార్లలో శ్రీ ఆండాళ్(గోదాదేవి) ఒకరుకాగా ఈమెను నాచియార్ అని కూడా పిలుస్తారు. శ్రీవేంకటేశ్వరస్వామివారిని స్తుతిస్తూ ఆండాళ్ రచించిన 30 పాశురాలను కలిపి తిరుప్పావై అంటారు. ఆళ్వార్ దివ్యప్రబంధంలో తిరుప్పావై ఒక భాగం కాగా తమిళ సాహిత్యంలో దీనికి విశేష ప్రాచుర్యం ఉంది. శ్రీవారి ఆలయంలో నెల రోజులపాటు జరిగే తిరుప్పావై పారాయణంలో రోజుకొకటి చొప్పున అర్చకులు నివేదిస్తారు. ఈ సమయంలో సాధారణంగా భోగశ్రీనివాసమూర్తికి బదులుగా శ్రీకృష్ణస్వామివారికి ఏకాంతసేవ నిర్వహిస్తారు. ఈ తిరుప్పావై పఠనం పూర్తిగా ఏకాంతంగా జరుగుతుంది.

## నష్టపోయిన ప్రతి రైతు అన్నకు మన ప్రభుత్వం తోడుగా ఉంటుంది




బాపట్ల జిల్లా ప్రజాపాలన డిసెంబర్ 8: రైతుభరోసా తో పాటు ఇన్పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ సంక్రాంతి జూన్ ఖరీఫ్ లోపు మొత్తం అందిస్తాము. అకాల వర్షాలతో నీట మునిగి పంట నష్టపోయిన ప్రతి రైతు అన్నకు మన ప్రభుత్వం తోడుగా ఉంటుంది. ఇది పేదల ప్రభుత్వం మీ ప్రభుత్వం తుఫాన్ కారణంగా రైతన్నలు లక్షల్లో నష్టపోయారు. నష్టపోయిన ప్రతి రైతన్నకు ప్రభుత్వం చేదోడుగా ఉండటమే కాదు. గిట్టుబాటు ధరలు కల్పిస్తాను అని మాట ఇస్తున్న అంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి

# ఏపీలో డ్యూయల్ ఓటు రచ్చ..



విజయవాడ, డిసెంబర్ 9, :తెలుగు రాష్ట్రాల్లో ఓటు హక్కు కలిగి ఉన్న వారి వ్యవహారం ఇప్పుడు ఏపీలో రాజకీయ అంశంగా మారింది. ఆంధ్రప్రదేశ్ స్థానికత కలిగి ఉన్న వారికి స్వస్థలంతో పాటు ఉద్యోగం, ఉపాధి, విద్యాభ్యాసం కోసం తెలంగాణలో స్థిరపడిన ప్రదేశంలో కూడా ఓటు హక్కును పొందారు. ఇలా ఏపీ స్థానికత కలిగిన వారిలో ఎందరికి తెలంగాణలో ఓటు హక్కు ఉందనే విషయంలో అధికారిక లెక్క లేకపోయినా రకరకాల అంచనాలు మాత్రం ఉన్నాయి. 2018లోనే ఈ అంశం తెరపైకి వచ్చినా అప్పట్లో ఎన్నికల సంఘం ఈ అంశాన్ని చూసి చూడనట్టు వ్యవహరించింది. 2018 చివరిలో తెలంగాణ అసెంబ్లీకి ముందస్తు ఎన్నికలు జరిగాయి. 2014లో రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కూడా ఉమ్మడి రాష్ట్రంలోనే సాధారణ ఎన్నికలు జరిగాయి. భౌగోళిక సరిహద్దులు, నియోజక వర్గాల ఆధారంగా రెండు రాష్ట్రాలకు ఫలితాలను వెల్లడించారు. 2018లో మాత్రం ఆర్నెల్ల ముందే తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వాన్ని రద్దు చేశారు. 2018 ఎన్నికల నాటికి తెలంగాణలో దాదాపు 30లక్షల మంది ఆంధ్రా స్థానికత కలిగిన వారు ఉంటారని అంచనాలు ఉన్నాయి. వారిలో 8 నుంచి 12లక్షల మందికి తెలంగాణతో పాటు ఏపీలో కూడా ఓటు హక్కు ఉందని పలు రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేశాయి. అయితే ఈ అంశానికి పెద్దగా ప్రాధాన్యత లభించలేదు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత రెండు రాష్ట్రాల్లో ఓటు హక్కు ఉండటంపై పార్టీలు అభ్యంతరం తెలిపాయి. ఇది ఫలితాలను తారుమారు చేసే స్థాయిలో ఉందని ఆందోళన వ్యక్తం చేసినా ఈసీ చేతులెత్తేసింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒకే సారి ఎన్నికలు జరగవు కాబట్టి పెద్దగా నష్టం ఉండదని అప్పట్లో ఏపీలో ఎన్నికల సంఘం ప్రధాన అధికారిగా పనిచేసిన గోపాల కృష్ణ ద్వివేది వివరణ ఇచ్చారు. ఓటు హక్కును నిరాకరించడానికి సహేతుకమైన కారణాలు ఉండాలని పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏపీలో మళ్లీ ఓట్ల విషయంలో మళ్లీ అలజడి మొదలైంది. గత కొద్ది రోజులుగా అధికార పార్టీ నేతలు ఎన్నికల సంఘం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణలో ఆంధ్రప్రదేశ్ స్థానికత కలిగిన 40లక్షల మంది నివసిస్తున్నారనే అంచనాలు ఉన్నాయి. వీరిలో ఎక్కువ మంది హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. దాదాపు పది లక్షల మందికి ఏపీలో ఓటు ఉంటుందని అనుమానిస్తున్నారు. డిసెంబర్ చివరి నాటికి దేశవ్యాప్తంగా ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించాల్సి ఉండటంతో రాజకీయ పార్టీలు ఓట్ల తొలగింపుకు హడావుడి మొదలుపెట్టాయి. పార్లమెంటు ఎన్నికలతో పాటు ఏపీ అసెంబ్లీ ఎన్నికలు కూడా మార్చి, ఏప్రిల్ నెలల్లో జరగాల్సి ఉంది. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటనకు ముందే రెండు చోట్ల ఓటు హక్కు ఉన్న వారిని గుర్తించి తొలగించాలని అధికార వైసీపీ డిమాండ్ చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల నాటికి హైదరాబాద్‌లో ఉన్న ఆంధ్ర ఓటర్లు ఏపీలో ఓటు హక్కును వినియోగించు కోడానికి వస్తారని ఆ పార్టీ అనుమానిస్తోంది. నవంబర్ 30వ తేదీ నాటికి తెలంగాణ ఓటర్ల జాబితాలో ఓటు హక్కు ఉన్న వారిని ఏపీలో జరిగే ఎన్నికల్లో ఓటు వేయకుండా చూడాలని ఈసీకి ఫిర్యాదు చేసింది. జాబితాలో ఉన్నా, స్థానికంగా నివసించని వారి ఓటును ఎప్పటికప్పుడు తొలగించాల్సి ఉన్నా రకరకాల కారణాలతో బిఎల్వోలు తొలగించకుండా వదిలేస్తున్నారు. ఉపాధి కోసం వేర్వేరు ప్రాంతాలకు వెళ్లిపోయిన ఓట్లను స్థానికంగానే కొనసాగించడంపై రకరకాల ఒత్తిళ్లు ఉంటున్నాయి. స్థానిక నేతల ఒత్తిడితో పాటు ఓటర్ల వినతులతో వాటిని కొనసాగిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో స?థానికత ధృవీకరణ కోసం ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఓటర్లు దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఉంటున్నా మిగిలిన రాష్ట్రాలతో పెద్దగా సమస్య లేదని ఎన్నికల సంఘం చెబుతోంది. ప్రధానంగా ఆంధ్రా ఓటర్లకు తెలంగాణలో పెద్ద సంఖ్యలో ఓటు ఉండటవే సమస్యగా మారుతోందని అధికారులు చెబుతున్నారు. తెలంగాణలో ఓటు వేసిన వారిని తిరిగి ఆంధ్రప్రదేశ్ లో ఓటు వేయకుండా చూడాలని ఫిర్యాదులు అందడంతో దానిపై ఏమి చేయాలనే దానిపై మల్లగుల్లాలు పడుతున్నారు. తెలంగాణాలో ఓటు వేసిన వారిని తిరిగి ఆంధ్రప్రదేశ్ లో ఓటు వేయకుండా చూడాలని కోరుతూ వైసీపీ తరపున వినతిపత్రం అందించారు. మంత్రులు చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ, జోగి రమేష్ , శాసనమండలిలో విప్ లేళ్ళ అప్పిరెడ్డి, పార్లమెంట్ సభ్యులు గురుమూర్తి సీఈఓ మీనాను కలిసి ఫిర్యాదు చేశారు.

# అనంతలో 300 కోట్ల సైబర్ మోసం



అనంతపురం, డిసెంబర్ 8, :అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం అగ్రహారం గ్రామానికి చెందిన అనిల్ కుమార్ తనకు జరిగిన సైబర్ మోసంపై జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన స్పందనలో ఫిర్యాదు చేశారు. అతను తెలిపిన వివరాల ప్రకారం.. అనిల్ కుమార్ అనంతపురం నగరంలో ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. తన ఫోన్ లోని టెలిగ్రామ్ యాప్ లో అతనికి సెప్టెంబర్ 21న ఒక మెసేజ్ వచ్చింది. మీకు ఏమైనా పార్ట్ టైమ్ జాబ్ చేయాలని ఉందా అని లింక్ వచ్చింది. పార్ట్ టైం జాబ్ కు ఆశపడి అనిల్ కుమార్ ఆ లింకును ఓపెన్ చేశాడు. నిర్వాణ డిజిటల్ గ్రూపులో ఆడ్ అయ్యారు. అనిల్ కు ప్రత్యేక యూజర్ ఐడి కూడా వచ్చింది. యూజర్ ఐడి ద్వారా నకిలీ పోర్టల్ లో యూట్యూబ్ వ్యాపార ప్రకటనలు అవతలి వారికి పంపిస్తుండాలని.. వాటిని సబ్‌స్క్రైబ్ చేసి రేటింగ్ ఇవ్వాలని.. ఇలా చేస్తే అధికంగా కమిషన్లు వస్తాయని నమ్మించారు. ముందుగా రూ.10 వేలు డిపాజిట్ చేస్తే వీడియోలు పంపిస్తామన్నారు. తన వద్ద డబ్బు లేదనడంతో మేమే చెల్లిస్తామంటూ రూ.10 వేలు కట్టినట్లు నకిలీ ఆధారాలు చూపించారు. అనిల్ కుమార్ అది నిజమని నమ్మి వారు పంపిన వీడియోలకు సబ్‌స్క్రైబ్ చేసి రేటింగ్ ఇచ్చాడు. మొదటగా రూ.800 కమిషన్ రూపంలో అనిల్ కుమార్ ఖాతాలో జమ అయ్యింది. దీంతో అనిల్ కుమార్ కు నమ్మకం ఏర్పడింది. ఇంకా ఎక్కువగా కమిషన్ రావాలంటే రూ.10 వేలు కట్టాలని సైబర్ నేరగాళ్లు మెసేజ్ పంపారు. పేటియం ద్వారా యూజర్ ఐడీకి పది వేలు పంపాడు. సైబర్ నేరగాళ్లు వీడియోలు పంపారు. కమిషన్ రూపంలో రెండోసారి రూ.2,625 వచ్చింది. తర్వాత సైబర్ నేరగాళ్లు ఒకేసారి రూ.50 వేలు పంపమన్నారు. అనిల్ కుమార్ అలాగే పంపాడు చివరకు ఖాతా హోల్డ్ లో పెట్టారు. మరోసారి రూ.1,50,000 పంపమని డిమాండ్ చేయగా ఆ మొత్తాన్ని వాళ్ళ ఖాతాల్లో వేశారు. అయినప్పటికీ ఐడీ హోల్డ్ లోనే ఉంది. ఎందుకు నా ఐడీ ఇంకా హోల్డ్ లో పెట్టారని అడగ్గా.. మరో నాలుగు లక్షల రూపాయలు పంపితే మొత్తం డిపాజిట్ అవకౌంట్ తిరిగి పంపిస్తామని చెప్పారు. అంత డబ్బు కట్టలేనని చెప్పడంతో అనిల్ ఐడిని ఏకంగా బ్లాక్ చేశారు. ఐడిని బ్లాక్ చేయడంతో మోసపోయాడని తెలుసుకొని సైబర్ క్రైమ్ పోర్టల్ లో ఫిర్యాదు చేశాడు. ఈ కేసు ఆధారంగా జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాలతో సైబర్ నేరగాళ్ల జాడ కోసం టెక్నికల్ టీం సపోర్ట్ తో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులకు దిమ్మ తిరిగిపోయే లావాదేవీలు అందులో కనుగొన్నారు. సుమారుగా రూ.300 కోట్లకు పైగా ఈ సైబర్ నేరగాళ్లు నిరుద్యోగ యువత నుంచి డబ్బులు కొట్టేసినట్లు పోలీసులు కనుగొన్నారు. దీంతో జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఈ కేసుపై ప్రత్యేక దృష్టి సారించి పోలీసులను ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి మరింత లోతుగా విచారించాలని ఆదేశించా రు. ఈ నేరగాళ్లలో ఆరుగురు ముఠా సభ్యులను అనంతపురం పోలీసులు అరెస్టు చేశారు. అరెస్ట్ చేసిన వారికి చెందిన 16 నకిలీ ఖాతాల నుంచి రూ. 35 కోట్ల 59 లక్షల లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. రూ.14 కోట్ల 72 లక్షలను ఫ్రీజ్ చేయించారు. ఈ కేసు విచారణలో భాగంగా నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరోలో సుమారు 1,550 ఫిర్యాదులు ఉండగా వీటిలో లావాదేవీల అంచనా వేస్తే సుమారు రూ.300 కోట్లపై మాటే అని వెల్లడించారు. ఈ కేసులో ఎలాగైనా ప్రధాన నిందితుణ్ని అరెస్టు చేయాలని జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాలతో పోలీసు బృందం రాష్ట్ర సరిహద్దులు దాటి వెళ్లారు. టెక్నికల్ టీం ఆధారంగా కీలక నిందితుడు జమ్మూ కశ్మీర్ లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే జమ్మూ కశ్మీర్ కు వెళ్లిన జిల్లా పోలీసులు సైబర్ నేరాల్లో ఆరు తేదీన కింగ్ పిన్ అనాయతుల్లా అలియాస్ ఫర్హాన్ ను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక జమ్మూ కశ్మీర్ పోలీసుల సహకారంతో అనాయతుల్లాను స్థానిక కుల్వారా మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. నిందితుల నుంచి మరింత సమాచారం రాబట్టేందుకు ట్రాన్సిట్ వారెంట్ పై అనంతపురం జిల్లాకు తీసుకువచ్చి రిమాండ్ కు పంపారు.

## అనంతలో స్టాట్యూ వార్

అనంతపురం, డిసెంబర్ 8, :అనంతపురం జిల్లాలో విగ్రహాల వార్ నడుస్తోంది. బీజేపీ వర్సెస్ వైసీపీగా రాజకీయం మారింది. సర్దార్ వల్లభాయ్ విగ్రహం పెడతామని బీజేపీ అంటుంటే టిప్పు సుల్తాన్ విగ్రహం పెడతామని వైసీపీ చెప్తోంది. దీంతో ఏక్షణాన ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. నగరంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం పెడతామని అధికారులకు బీజేపీ దరఖాస్తు చేసుకుంది. ఆ దరఖాస్తుపై అధికారులు స్పందించాల్సి ఉంది. ఇంతలో కొంతమంది వైసీపీ నేతలు టిప్పు సుల్తాన్ విగ్రహం పెట్టేందుకు రెడీ అయ్యారు. అంతేకాదు బీజేపీ అనుకున్న స్థలంలోనే ఏకంగా భూమి పూజ కూడా చేసేశారు. ఈ వ్యవహారం అటు బీజేపీ ఇటు వైసీపీల మధ్య రాజకీయ యుద్ధానికి తెరలేపింది. సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం పెడతామనుకున్న చోట వైసీపీ నాయకులు టిప్పు సుల్తాన్ విగ్రహం కోసం పూజాది కార్యక్రమాలు చేయడంపై మండిపడ్డారు. ఈ అంశంపై బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి స్పందించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్, టిప్పు సుల్తాన్ విగ్రహాల విషయంలో ప్రజాభిప్రాయం తీసుకుందాం అంటూ వైసీపీకి సవాల్ విసిరారు. ఎవరి విగ్రహం కావాలో ప్రజలే నిర్ణయిస్తారన్నారు. కొంతమంది స్వార్థ రాజకీయల కోసం విగ్రహాల మీద రాజకీయం చేస్తున్నారు అని మండిపడ్డారు. ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని కొంతమంది చూస్తున్నారని.. ఓటు బ్యాంకు రాజకీయాల ముసుగులో శాంతి భద్రతల ఘర్షణ వాతావరణం ఏర్పడే విధంగా వైసీపీ చేస్తోంది అని మండిపడ్డారు. వైసీపీ కేంద్ర కార్యాలయం ఆదేశాలతోనే పార్టీ నేతలు ఇలాంటి దుర్మార్గపు చర్యలకు దిగుతున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి ఆరోపించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం ఏర్పాటుకు సంబంధించి అనుమతి కోరుతూ దరఖాస్తు చేశామో అదే ప్లేస్‌లో 10 రోజుల్లో బీజేపి సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం పెడుతుంది అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి తెగేసి చెప్పారు. ఎవరు అడ్డుకుంటారో చూస్తాం అని అన్నారు. అనంతపురం అర్బన్ వైసీపీ టికెట్ కోసం విగ్రహాల వివాదం తెరమీదకు తెచ్చారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ టికెట్ పంచాయితీ తాడేపల్లిలో తేల్చుకోండి... ప్రశాంతంగా ఉన్న అనంతపురంలో కాదు అని చెప్పుకొచ్చారు. బీజేపీ పార్టీతో చేతనైతే రాజకీయంగా తేల్చుకోండి... మా పార్టీ సిద్ధంగా ఉంది అని ఛాలెంజ్ చేశారు. గతంలో ప్రొద్దుటూరులో ప్రయత్నాలు చేసి విఫలమైంది. ఏపీలో ఎక్కడా లేని టిప్పు సుల్తాన్ విగ్రహం అనంతపురంలో ఎందుకు అని నిలదీశారు. కనీసం ఆయన పుట్టిన మైసూర్‌లో కూడా లేదు అని చెప్పుకొచ్చారు.

## కొత్త వ్యక్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా తెరపైకి రావడంపై చర్చనీయాంశం



పోరుమామిళ్ల ప్రజాపాలన ప్రతినిధి: కాశినాయన మండలం పిట్టిగుంట గ్రామానికి చెందిన బిజీవేముల శివారెడ్డి భార్య నేతి కొప్పుల శ్రీలత కుటుంబం ఉద్యోగరీత్యా తిరుపతిలో ఉంటున్నారు. ఆమె కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఉద్యోగులు కావటం, ఆర్థికంగా బలంగా ఉండటం, ఆమె బంధు వర్గం కాశినాయన ,కలసపాడు,పోరుమామిళ్ల, బి.కోడూరు ,అట్లూరు,గోపవరం,బద్వేలు మండలంలోని ప్రతి ఊరిలో బంధువులు ఉండడం, వారికి రాజకీయ నేపథ్యం ఉండడంతో వారిని ఆదర్శంగా తీసుకుని ప్రజలకు మరింత సేవ చేయాలనే ఉద్దేశంతో ఆమె రాజకీయాల్లోకి వస్తున్నట్లు తెలిపారు. కుల ప్రాతిపదికన రాజకీయాలు నడుస్తున్న నేటి రాజకీయాలలో భర్త రెడ్డి కులస్తుడు, ఆమె ఎస్సీ మాల కులానికి చెందిన వ్యక్తి కావడం, నియోజకవర్గ వ్యాప్తంగా భార్యాభర్తల కులాల నుంచి బలమైన బంధువర్గం ఉండడం, రెడ్డి మాల కులస్తుల ఓట్లు నియోజకవర్గంలో 90 వేలు ఉండడంతో గెలుపు అవకాశాలు పుష్కలంగా ఉంటాయని భావిస్తున్నారు. అయితే ఏ పార్టీ నుంచి పోటీ చేసేది ఇంకా నిర్ణయించుకోలేదని, రెండు ప్రధాన కులాలలో బలమైన ఓటు బ్యాంకు కలిగిన నాకు వైసిపి,టిడిపి పార్టీలలో ఎవరు టికెట్ ఇచ్చినా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలియజేశారు.

## తుఫాను వల్ల నష్టపోయిన రైతులను ఆదుకుంటాం: మొండితోక జగన్ మోహన్ రావు

కంచికచర్ల డిసెంబర్ 8 ప్రజా పాలన ప్రతినిధి: మండ లంలోని పరిటాల మరియు శివారు గ్రామాల్లోని దెబ్బ తిన్న పంట పొలాలను శాసనసభ్యులు డాక్టర్ మొం డితోక జగన్ మోహన్ రావు పరిశీలించారు మండ లంలో ఎక్కువగా వాణిజ్య పంటలైన మినుములు, పె సలు, మొక్కజొన్న, జొన్న, ఉప్పు శనగ పంటలు పూర్తి గా దెబ్బతిన్నాయని.. కొన్ని పంట పొలాల్లో ఇంకా వర్ష పు నీరు బయటకు పోని పరిస్థితి ఉందని తెలిపారు నష్టపోయిన రైతులందరికీ న్యాయం జరిగేలా అధికా రులు పంట నష్ట వివరాలను నమోదు చేసి, ఖచ్చిత మైన నివేదికలు సమర్పించాలని. పంట నష్టం అంచనాలు సిద్ధం చేసే సమయంలో అధికారులు, సిబ్బంది ఎలాంటి అలసత్వం వహించకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టిందని రైతులు ఎక్కడ అధైర్యపడవ ద్దని, ప్రభుత్వం అన్ని రకాలుగా



ఆదుకుంటుందని స్ప ష్టం చేశారు ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆయా గ్రామాల రైతులు, వైయస్ఆ ర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

## ఆడుదాం ఆంధ్రా" బ్రోచర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్



నందిగామ డిసెంబర్ 8 ప్రజా పాలన ప్రతినిధి :పట్ట ణంలోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ పాఠశాలల పిడిలు, పార్టీ నాయకులతో కలిసి "ఆడుదాం ఆంధ్రా" బ్రోచర్ ను శాసనమండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరు ణ్ కుమార్ శుక్రవారం ఆవిష్కరించారు ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూప్రతిభావంతులైన క్రీడాకారు లను వెలుగులోకి తేవడమే లక్ష్యం అన్నారుక్రీడల ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రోత్సహించడం ప్రతిభావంతులైన క్రీడాకారులను కనుగొని వారిని పెద్ద వేదికకు పరిచయం చేయటమే ధ్యేయం అన్నారు యువతకు చదువు ఒక్కటే కాదు క్రీడలు కూడా ఉం డాలి అందుకే ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' ద్వారా పెద్ద ఎత్తున క్రీడా శక్తిని పెంపొందిస్తోంది. దాదాపు నెల న్నర రోజుల పాటు ఈ పోటీలు ఉంటాయని తెలి పారు

# నాని.. జెట్ స్పీడ్ లో మరో ప్రాజెక్ట్



నేచురల్ స్టార్ నాని.. వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. జయాపజయాలతో సంబంధం లేకుండా వరుసపెట్టి సినిమాలు చేస్తున్నారు. దసరా సినిమాతో సూపర్ హిట్ అందుకున్న నాని.. తాజా హాయ్ నాన్న సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా.. హిట్ టాక్ సంపాదించుకుంది. ఈ చిత్రం షూటింగ్ పూర్తి అయిన తరువాత తమిళ దర్శకుడు సిబి చక్రవర్తితో సినిమా చేయనున్నారు. ప్రస్తుతం ఈ మూవీకి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నాయట.ఏప్రిల్ లేదా మే నుండి రెగ్యులర్ షూట్ ప్లాన్ చేస్తున్నారట. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోందట. ఈ సినిమాలో హీరోయిన్ గా పొడుగు కాళ్ల సుందరి పూజా హెగ్డే కనిపించనుందట. అయితే ఈ సినిమాను కూడా నాని వేగంగా పూర్తి చేయలానుకుంటున్నారట. ఎందుకంటే దర్శకుడు శైలేష్ కొలను తో హిట్ 3 ది థర్డ్ కేస్ ప్రాజెక్ట్ చేయాలని నాని భావిస్తున్నారట. ఇప్పటికే ఈ సీక్వెల్ కు సంబంధించిన హింట్ ను హీరో అడవి శేష్ హిట్ 2 క్లైమాక్స్ లో ఇచ్చిన విషయం మనకు తెలిసిందే. తన లైనప్ లో ఇన్ని సినిమాలు పెట్టుకున్న నాని.. మరో సినిమాకు కూడా సిద్ధమవుతున్నారట. తనకు దసరా లాంటి బ్లాక్ బస్టర్ హిట్ ఇచ్చిన శ్రీకాంత్ ఓదెలతో మరో మూవీ చేయడానికి రెడీ అవుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన కథా చర్చలు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ లైనప్ చూస్తుంటే.. నాని వచ్చే ఏడాదంతా బిజీబిజీగా గడపనున్నారు. వరుస షూటింగ్ లలో పాల్గొనున్నారు. ఒకవైపు క్లాస్ ప్రేక్షకులను తన వైపు తిప్పుకుంటూనే మరొక వైపు మాస్ సినిమాలను చేయాలన్న నాని ఆలోచనాలు ఎంత వరకు సక్సస్ అవుతాయో చూడాలి మరి.

## క్రేజీ టైటిల్ తో యష్ నెక్స్ట్ రిలీజ్ డేట్ కూడా ఫిక్స్.!




కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా నటించిన గత చిత్రాలు కేజీయఫ్ సిరీస్ హిట్ అయ్యిన తర్వాత తన నెక్స్ట్ ప్రాజెక్ట్ ఏంటి ఎవరితో అనేది చాలా కాలం సస్పెన్స్ గానే ఉంది. మరి ఈ చిత్రం మోస్ట్ అవైటెడ్ గా మారిన ఈ బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ పై మేకర్స్ ఇప్పుడు సాలిడ్ అనౌన్సమెంట్ తో భారీ అప్డేట్ రివీల్ చేశారు.ఈ చిత్రం టైటిల్ సహా రిలీజ్ డేట్ ని కూడా లాక్ చేసేసి ఫ్యాన్స్ కి అదిరే ట్రీట్ ఇచ్చారు. ఇక ఈ భారీ చిత్రంపై ఓ ఇంట్రెస్టింగ్ టైటిల్ టీజర్ ని స్టన్నింగ్ బ్యాక్గ్రౌండ్ స్కోర్ తో రివీల్ చేస్తూ ఈ సినిమా టైటిల్ ని "టాక్సిక్" అంటూ రివీల్ చేయగా ఇందులో యష్ లుక్ కూడా ఎలా ఉంటుంది అనేది హింట్ ఇచ్చారు.

# ఉస్తాద్ కోసం ఆ అగ్ర హీరోలు రాగలరా?



సినిమా స్టార్లందరూ ఓటీటీల వైపు చూస్తున్న ఈ కాలంలో మరో టాలీవుడ్ స్టార్ మంచు మనోజ్ కూడా ఈటీవీ విన్ ద్వారా ఎంట్రీ ఇస్తున్నారు. ఉస్తాద్ పేరుతో ఓ కొత్త సెలబ్రిటీ టాక్ షో చేయబోతున్నారు. డిసెంబర్ 15 నుంచి ఈటీవీ విన్ ఓటీటీలో ఈ షో స్ట్రీమింగ్ కానుండగా అందుకు సంబంధించిన ప్రోమో ఇటీవలే విడుదలై ఆసక్తి రేపుతోంది.ఈ షో కోసం ఇప్పటికే యూనిట్.. పలువురు హీరోలను గెస్ట్ లుగా రప్పించి షూట్ పూర్తి చేసిందట. మాస్ మహారాజా రవితేజ, నేచురల్ స్టార్ నాని, యంగ్ హీరో అడవి శేష్ పై షూట్ కంప్లీట్ చేసిందట. మరికొంతమంది యంగ్ హీరోలను కూడా పిలవాలని చూస్తోందట. ఆ జాబితాలో జూనియర్ ఎన్టీఆర్, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పేర్లు ముఖ్యంగా వినిపిస్తున్నాయి.తారక్, రామ్ చరణ్ ఈ షోకు రాగలరా అంటూ ఫ్యాన్స్ ప్రశ్నిస్తున్నారు. ఆర్ ఆర్ ఆర్ తర్వాత చిన్న బ్రేక్ తీసుకున్న వీరిద్దరు ఇప్పుడు సినిమా షూటింగ్స్ లో ఫుల్ బిజీగా ఉన్నారు. జూనియర్ ఎన్టీఆర్ ఓ వైపు దేవరలో నటిస్తుండగా.. చరణ్ గేమ్ ఛేంజర్ సినిమా పూర్తి చేస్తున్నారు. ఆ తర్వాత కూడా వీరిద్దరి కాల్షీట్లు ఫుల్ బిజీగా ఉన్నాయి. తారక్ ప్రశాంత్ నీల్ తో సినిమా చేయనుండగా.. చరణ్ బుచ్చిబాబుతో మూవీలో నటించనున్నారు. మరికొందరు మాత్రం షూటింగ్స్ కు చిన్న బ్రేక్ ఇచ్చి వీరిద్దరు మనోజ్ షోకు వస్తారని అంటున్నారు."నేను మీ మనోజ్. నా కథ మీరు రాసుకున్నది, నా రాక మీరు పిలుస్తున్నది. ప్రతి హీరోని నడిపించే సైన్యం ఫ్యాన్స్. ప్రతి స్టారూ సంపాదించుకునే ధైర్యం ఫ్యాన్స్. అలాంటి ఫ్యాన్స్ కు నేను ఇవ్వబోతున్న రిటర్న్ గిఫ్టే ఉస్తాద్" అని మనోజ్ ప్రోమో లో చెప్పారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఈ షోను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. తెలుగు ఓటీటీల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకోవడం కోసం ఆరాటపడుతున్న ఈటీవీ విన్ ఈ కొత్త షోపై ఆశలు పెట్టుకుంది. అయితే టాలీవుడ్? హీరోలు షోస్? కు హోస్ట్?లుగా వ్యవహరించడం ఇదేం కొత్తకాదు. ఇది వరకే తెలుగు టాప్? హీరోలు జూనియర్ ఎన్?టీఆర్ (బిగ్?బాస్ తెలుగు సీజన్ 1, మీలో ఎవరు కోటీశ్వరుడు), నేచురల్ స్టార్ నాని (బిగ్?బాస్ సీజన్ 2), రానా దగ్గుబాటి (No.1 యారి), మెగాస్టార్ చిరంజీవి (మీలో ఎవరు కోటీశ్వరుడు), నాగార్జున అక్కినేని (బిగ్?బాస్ సీజన్ 3 నుంచి), నందమూరి బాలకృష్ణ (అన్?స్టాపబుల్ టాక్ షో) హోస్ట్?లుగా చేశారు.

# తెలుగులో డబ్బింగ్ హవా.. 50కోట్ల సినిమాలివే!




తెలుగులో డబ్బింగ్ సినిమాలకు మంచి మార్కెట్ ఉన్న విషయం అందరికీ తెలిసిందే. ముఖ్యంగా తమిళ హీరోల సినిమాలను టాలీవుడ్ ప్రేక్షకులు ఎక్కువగా ఆదరిస్తారు. అక్కడి సూపర్ స్టార్ రజినీకాంత్, కమల్ హాసన్, సూర్య, కార్తీ, విజయ్ లాంటి హీరోలకు తెలుగులో కూడా మంచి మార్కెట్ ఉంది. వారి సినిమాలు చాలా వరకు టాలీవుడ్ లో సూపర్ హిట్ అయ్యాయి. బాలీవుడ్ స్టార్ హీరోల సినిమాలు కూడా తెలుగులో హిట్ టాక్ సంపాదించుకుని వసూళ్ల వర్షం కురిపించాయి.తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ సినిమాలకు తెలుగు ప్రేక్షకులు బ్రహ్మరథం పడతారు. అయితే రజనీ సూపర్ హిట్ మూవీ రోబో.. తొలిసారి తెలుగు రాష్ట్రాల్లో 50 కోట్ల రూపాయల గ్రాస్ సాధించింది. ఆ తర్వాత ఆ సినిమాకు సీక్వెల్ గా వచ్చిన రోబో 2.0 కూడా 2018లో రూ.50 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఈ రెండింటికి మధ్యలో విక్రమ్ బ్లాక్ బస్టర్ మూవీ ఐ మనోహరుడు.. 2018లో సూపర్ హిట్ టాక్ సంపాదించి 50 కోట్లకు పైగా వసూలు చేసింది. ఆ తర్వాత కొవిడ్ మహమ్మారి విజృంభించడంతో సినిమా రిలీజ్ లు, వసూళ్ల వర్షాలు తగ్గాయి. పోస్ట్ పాండమిక్ ప్రపంచంలో మళ్లీ ఊపందుకున్నాయి. కన్నడ స్టార్ యశ్- ప్రశాంత్ నీల్ కాంబోలో తెరకెక్కిన కేజీఎఫ్-2 ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తెలుగు రాష్ట్రాల్లో కూడా రూ.50 కోట్ల గ్రాస్ వైలు రాయిని అందుకుంది.అనేక రోజుల పాటు ఈ సినిమాకు అభిమానులు క్యూ కట్టారు. రూ.50కోట్ల వసూళ్లను అందించారు. హాలీవుడ్ మూవీ అవతార్-2 కూడా భారీగా వసూళు సాధించింది. 2023లో బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షమే అని చెప్పొచ్చు.

# బాలయ్య - బోయపాటి.. ఏం జరుగుతోంది?



నందమూరి బాలకృష్ణ- బోయపాటి శ్రీనులది హిట్ కాంబినేషన్ అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. గతంలో వీరిద్దరి కాంబినేషన్లో వచ్చిన సింహా, లెజెండ్, అఖండ సినిమాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలు సాధించాయి. బాలయ్యకు పెద్ద కమర్షియల్ సినిమాలుగా గుర్తింపు తేవడమే కాకుండా ఆయన కెరీర్లో సూపర్? హిట్? చిత్రాలుగా కూడా నిలిచాయి. బోయపాటి మిగతా హీరోలతో ఎలాంటి సినిమా చేసినా.. బాలకృష్ణతో సినిమా అంటే మాత్రం రెచ్చిపోయి డైలాగులు చెప్పిస్తారు. ఫైట్లు చేయిస్తూ ప్రేక్షకుల్లో మంచి ఊపు తెప్పిస్తారు. ప్రస్తుతం బోయపాటి- బాలయ్య కూడా అదే పనిలో ఉన్నారు! ఈ సూపర్ హిట్ కాంబో నాలుగో సినిమా చేయడానికి రెడీ అవుతున్నారు. వీరి కాంబోలో కొత్త సినిమా అనగానే అందరూ అఖండ-2 ఎక్స్?పెక్ట్ చేస్తారు. ఎందుకంటే సీక్వెల్ స్టోరీ రెడీగా ఉందని ఆ మధ్య ఓ రియాలిటీ షోలో బోయపాటి స్టేట్ మెంట్ కూడా ఇచ్చారు. కానీ ఇప్పుడు బాలయ్య మాత్రం ఫ్రెష్ కథతో వెళ్దామని అనుకుంటున్నట్టుగా తెలుస్తోంది.ఈ మూడు స్టోరీలు బాలయ్యకు నచ్చాయట. దీంతో బోయపాటి ఏ కథతో ముందుకు వెళ్లాలో తెలియక డైలమాలో పడ్డారట. అయితే బాలకృష్ణకు మూడు స్టోరీలు నచ్చడంతో ఏ స్టోరీని ఫైనల్ చేసి బోయపాటి ప్రేక్షకుల ముందుకు వస్తారన్నది టాలీవుడ్ లో ఆసక్తికరంగా మారింది. ఇటీవలే బాలయ్య భగవంత్ కేసరిలో థియేటర్లలోకి రాగా.. ప్రస్తుతం బాబీ దర్శకత్వంలో సినిమా చేస్తున్నారు. బాలకృష్ణ కెరీర్?లో ఇది 109 వ చిత్రం. దీంతో ఈ సినిమా ఎన్?బీకే 109 (NBK) వర్కింగ్ టైటిల్?తో రూపొందనునుంది. సితార బ్యానర్?పై సూర్యదేవర నాగవంశీ, ఎస్.సాయి సౌజన్య సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికీ హ్యాట్రిక్ హిట్లు కొట్టిన సీనియర్ హీరోగా మంచి గుర్తింపు సంపాదించుకున్నారు బాలయ్య. ఇప్పుడు బాబీతో చేస్తున్న సినిమాతో హిట్టు అయితే ఆయనకు తిరుగులేదు. ఆ తర్వాత వచ్చే బోయపాటి ఎలాగో హిట్ అయ్యే అవకాశం ఉంది. కాబట్టి వరుసగా ఐదు సినిమాలను హిట్లు కొట్టిన సీనియర్ హీరో గా ఎవరికీ సాధ్యం కాని రికార్డ్ సృష్టించడానికి బాలకృష్ణ సిద్ధమవుతున్నారు.

# డియోల్ బ్రదర్ తో గోపీచంద్ మలినేని?



మన టాలీవుడ్ సినిమా దగ్గర ఉన్న పలువురు సక్సెస్ ఫుల్ దర్శకుల్లో దర్శకుడ్ గోపీచంద్ మలినేని కూడా ఒకరు. మరి గోపీచంద్ మలినేని రీసెంట్ గానే "వీరసింహా రెడ్డి" తో మంచి హిట్ ని అందుకున్నారు. అలాగే చిత్రం అనంతరం మాస్ మహారాజ్ రవితేజతో కూడా ఓ సినిమా అనౌన్స్ చేశారు కానీ అది పలు కారణాలు చేత ఆగింది. మరి ఈ గ్యాప్ లోనే ఈ స్టార్ దర్శకుడు ఓ బాలీవుడ్ స్టార్ తో అయితే సినిమా చేయనున్నారని కొన్ని రూమర్స్ వచ్చిన సంగతి తెలిసిందే.మరి ఇప్పుడు అది ఎవరితో అనేది వినిపిస్తుంది. ఈ ఏడాది బాలీవుడ్ సినిమా దగ్గర సెన్సేషనల్ హిట్స్ అందుకున్న డియోల్ బ్రదర్స్ లో ఒకరైన సన్నీ డియోల్ తో అయితే గోపీచంద్ మలినేని వర్క్ చేయనున్నారని ఇపుడు రూమర్స్ వినిపిస్తున్నాయి. మరి ఈ క్రేజీ కాంబినేషన్ పై అధికారిక క్లారిటీ ఇంకా రావాల్సి ఉంది. అలాగే ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహించనున్నారట.



# యశ్ 19 అప్డేట్ ఆగయా.. పవర్ఫుల్ టైటిల్



పాన్ ఇండియా స్టార్ యశ్ అభిమానులు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నసమయం ఆసన్నమైంది. యశ్ కొత్త సినిమా టైటిల్ అనౌన్స్ మెంట్ వచ్చేసింది. కొద్ది రోజుల క్రితం యశ్ 19వ సినిమాకు సంబంధించి అప్డేట్ రాగా.. మూవీ టైటిల్ మాత్రం అనౌన్స్ చేయలేదు. తాజాగా శుక్రవారం ఉదయం 9.55 గంటలకు టైటిల్ ను మేకర్స్ ప్రకటించారు. దాంతోపాటు టైటిల్ అనౌన్స్మెంట్ వీడియోను కూడా రిలీజ్ చేశారు. యశ్ 19వ సినిమాకు టాక్సిక్ టైటిల్ ను ఖరారు చేశారు మేకర్స్. ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్ అన్న ట్యాగ్ లైన్ ను కూడా యాడ్ చేశారు. ఇది టైటిల్ అనౌన్స్మెంటే అయినప్పటికీ ఆ వీడియోలో యశ్ లుక్ను కూడా రివీల్ చేశారు. కానీ అది క్లారిటీగా కనిపించడం లేదు. టాక్సిక్ పేరు బ్యాక్గ్రౌండ్లో తుపాకీతో యశ్ కనిపించారు.మరోవైపు, ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. ఈ మూవీ తెలుగుతో పాటు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రానికి గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. కానీ ఈ సినిమాలో హీరోయిన్ తో పాటు ఇతర వివరాలను మేకర్స్ వెల్లడించలేదు. త్వరలోనే ఈ వివరాలు బయటకు వచ్చే అవకాశం ఉంది. కేజీఎఫ్ సినిమాలతో యశ్ దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. రాకీ భాయ్గా ప్రేక్షకుల మదిలో నిలిచిపోయారు. పాన్ ఇండియా స్టార్ గా తనకంటూ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్నారు. అయితే చాలా నెలలుగా కొత్త సినిమాను ప్రకటించలేదు యశ్. తన తర్వాతి సినిమా కేజీఎఫ్ చిత్రాలను మించి ఉండాలన్న ఉద్దేశ్యంతో కథల ఎంపిక కోసం ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారట.దాదాపు సంవత్సరం నుంచి కథల్ని వింటూనే ఉన్నారట. ఫ్యాన్స్ అయితే యశ్ కొత్త సినిమా ఎప్పుడు వస్తుందాఅని ఎదురుచూసి అలసిపోయి సోషల్ మీడియా వ్యాప్తంగా అసహనం కూ డావ్యక్తం చేశారు.యశ్ మాత్రం మంచి కథ కోసం వెతికి వెతికి చివరకు టాక్సిక్ కథకు ఓకే చేప్పారు. మరికొద్దిరోజుల్లో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది.

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16. and SREE SESHASAI ENTERPRISES "D.NO : 3-88, "C/O CHANDRA THEATER," GOSALA VILLAGE, "MAIN ROAD, PENAMALURU MANDAL, KRISHNA DT, ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com
PIN: 521151."MOBILE :9912333140 Email : sreeseshasaivja@gmail.com.